AGCA/01/B115

అత్రి వి. వేంకటరమణ

మాళవికాగ్నిమిత్రము

మహాకవి కాళిదాస కృతికిఁ దెనుఁగు

మల్లంపల్లి శరభయ్య

సర్వస్వామ్యములు రచయితవి
వేయి ప్రతులు
మూడవ కూర్పు

ప్రతులకు :

మ ల్లం ప ల్లి శ ర భ య్యా,
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల,
రాజమహేంద్రవరము-1.

వెల : మూడు రూపాయలు

ముద్రణ : అవంతీ ప్రెస్, రాజమహేంద్రవరము-1

శ్రీ శివాభ్యాం నమః

మాళవికాగ్నిమిత్రము

ప్రథమాంకము

నాంది

సూత్రధారుడు :-

ప్రణత నానాఫలప్రద మీశ్వరత్వమ్ము
        నెనసియు నెవఁడు చర్మైకధరుఁడు
కాంతావిభాగ సంకలితదేహుండయ్యు
        ధృతినిర్విషయ మనోధ్యేయుఁ డెవఁడు
తనువులెన్మిది జగత్సంభారవహలయ్యు
        నభిమానలేశమ్ము నంటదెవని
సన్మార్గ దర్శనశ్శ్రేయసము పొంచె
        నతఁడు దొలంగఁబెట్టుతఁ బ్రగాఢ
మగుచు సకలాంతరంగమ్ము లలమియున్న
చిరతమోవృత్తి సభవుండు తరుణ చంద్ర
మఃకళాకాంతికృతకాయమాన వలిత
పాటల జటాలతా పల్లవములవేల్పు.

(తెరవంకఁ జూచి)

సూత్ర :- మారిషా !

మారి :- (ప్రవేశించి) ఏమి బావా ?

సూత్ర :- నేటి వసంతోత్సవ సందర్భములోఁ గాళిదాసు సంత రించిన మాళవికాగ్నిమిత్రమును బ్రదర్శింపవలసినదని యభిజ్ఞుల యాదేశము కావున సంగీత రచన యొన రింపుము.

మారి :- ఆఁ ప్రతిమాస్వప్నవాసవదత్తాది మహానాటకములుండఁగా దీని ప్రసక్తియేమి ?

సూత్ర :- ఎంత తెలివితక్కువతనము !

ప్రాచీనమెల్లఁగాదు స
మీచీనము కృతికవద్యహేతువుగాద
ర్వాచీనతయుఁ, బ్రమాణము
ధీచతురులు; మూఢులితరధీనేయమతుల్. 2

మారి :- చిత్తము.

సూత్ర :- మరి నీవు వేగిరపడవలయును.

సంగృహీతమ్ము పరిషదాజ్ఞాక్రమమ్ము
నౌదలందాల్చి యొనరింతు నధికవినతి.
ధారణీనిదేశము నౌదలఁ దాల్చికొనుచుఁ
బరువులిడెడి సేవాదక్ష పరిజన మన. 3

మారి :- మంచిది.

(ఇద్దఱు నిష్క్రమింతురు)

ఇది ప్రస్తావన

(పిమ్మట వకుళావళిక ప్రవేశించును)

వకు :- అవును. ధారణీదేవి చెప్పినట్లు మొన్ననే మొదలుపెట్టిన ఛలికములో మాళవిక యెంతవరకున్నదో పోయి గణదాస నాట్యాచార్యులను కనుగొందును. (పరిక్రమించును)

(అపుడు ఆభరణముతో కౌముదిక ప్రవేశించుచున్నది)

వకు :- (చూచి) ఏమే కౌముదికా! ఎక్కడి గడుసుదనమే? మొగముమీఁదుగాఁ బోవుచుండియు నీవైపే చూడవు!

కౌము :- ఓహో! వకుళావళికవా? ఔను. అమ్మగారి నాగముద్రాంకితమగు నీ క్రొత్త యుంగరమునుఁ జూచు తమకములో నీమాట పడితిని.

వకు :- (పరికించి) అవును, వెలుఁగుదారములతో విచ్చుకొనిన యీ యుంగరముతో నీ చిగురుఁగేలు పూఁచినట్లున్నది.

కౌము :- ఎక్కడకి బయలుదేరినావు?

వకు :- అమ్మగారి సెలవుమీఁద నాట్యాచార్యుల సన్నిధికి, మాళవికా విషయమై.

కౌము :- ఇట్లు చదువుసంతల వెంటనున్న యామెను ప్రభు వెప్పుడు దర్శించెనో?

వకు :- చిత్తరువులో నమ్మగారి వెనుకనున్నపుడు.

కౌము :- ఎట్లు?

వకు :- చిత్రశాలలో దేవి యాచార్యలిఖితమయిన తన ప్రతికృతిని, ఏకమనస్కయై యవధరించునప్పుడు ప్రభువు వచ్చెను.

కౌము :- ఆ తరువాత ?

వకు :- మర్యాదలు నడచినపిమ్మట నేకాసనయగు దేవితోఁ జిత్త రువులోని యామె ప్రసక్తినిఁ దెచ్చెను.

కౌము :- ఏమని ?

వకు :- "వెనుక మే మెప్పుడు చూడలేదు; దేవికి సన్నిహితయైన యీమె పేరేమి ?"

కౌము :- సుందరములైన వస్తువులయం దాదర మప్రయత్న సిద్ధము. ఆపైని ?

వకు :- దేవినుండి నిరుత్తరుఁడైన ప్రభువునకుఁ గుమారిక వసు లక్ష్మి "ఆమె మాళవిక" యని తెలిపెను.

కౌము :- (నవ్వుతో) పసితనముగదా ! తరువాత ?

వకు :- ఏమున్నది ? ఇపుడు మాళవిక రాజుకంటఁ బడుటకసలే వీలులేక పోయినది.

కౌము :- సరే నీవు పద. నేనును పోయెదను. (నిష్క్రమించును)

వకు :- పరిక్రమించి చూచి) అదుగో నాట్యాచార్యులు ! సంగీత శాల నుండి వచ్చుచున్నారు. పోయి కనుపించెదను. (పరిక్రమించును)

గుణ :- ఎవని కుల విద్యయందు వాని కభిమానము. నాట్యము నందు మాకున్నదిమాత్రమట్టిది కాదు. ఔనుగదా !

చక్షుర్విషయిమాత్ర సకల భోగులకును
సౌపర్వులకు నెద్ది చాక్షుషేష్టి

లలితోద్ధతమ్ముగా లలనావిభిన్నార్థ
 శివమూర్తిలో నెద్ది యవఘళించె
త్రిగుణోద్భవంబైన జగతీ చరిత్రమ్ము
 నానారసైక సంస్థాన మెందు
దర్శింపనగు బహుధా భిన్నరుచిలోక మెం
 దేకరీతి రంజించునదియు
నొక్క యారాధన విశేషమూహసేయ
సుప్రయుక్తమ్ము నై స్వర్గసుఖవిధాయి
ద్రష్టృ జనమునకును ప్రయోక్తలకునెందు
వేదసారమ్ముసూ । నాట్య వేదమనఁగ. 4

వకు :- (సమీపించి నమస్కరించును)

గణ :- చిరంజీవ !

వకు :- అమ్మగారు మిమ్మడిగి రమ్మన్నారు — విద్యాగ్రహణములో శిష్యురాలు మీకు ప్రయాసము కలిగించుటలేదు గదా ?

గణ :- అభ్యాసనిపుణయైన యామె మేధావిని యని దేవికి విన్నవింపుము. ఇంత యేల !

అతివకు నేఁ బ్రయోగ సమయమ్ములఁ దెల్పిన భావికమ్ము సం
గతమయి తత్తనూవిమలకాంతి వితానములోనపూర్వ సం
స్థితి మెఱయంగఁ దద్గతవిశేషము మున్ను నెఱుంగనట్టు లు
ప్పతిలుటఁ దోఁచు నామదికిఁ బ్రత్యుపదేశ మొనర్చు కైవడిన్. 5

వకు :- (తనలో) ఇరావతిని మిగులుచున్నది కాఁబోలును (ప్రకాశము) గురువుల కీ విధముగాఁ దృప్తిని కలిగించిన యామె ధన్యురాలు.

గణ :- అట్టివారదురు. ఆమె యెచ్చట లభించినదో ?

వకు :- ధారణీసోదరుఁడైన వీరసేనుఁడు ప్రభువుచే నర్మదా తీరమున నంతపాల దుర్గాధిపతిగా నియమింపఁబడెను. విద్యాభ్యాసయోగ్య యని యాతఁ డీమెను దేవి కుపాయన మంపెను.

గణ :- (తనలో) రూపవిశేష మామె మహాకులీనతనే ధ్వనించుచున్నది. (ప్రకాశము) ఇంతకు నేనదృష్టవంతుఁడను.

పాత్రవిశేష సంపాదితమ్మౌని
చిత్రకాంతి వహించు శిల్ప మెప్పటిదె
శుక్తి గర్భాంతరస్రుత జలమ్ములకు
ముక్తాఫలత్వమ్ము మొదటితార్కాణ. 6

వకు :- మాళవిక యెచ్చట ?

గణ :- ఇప్పుడే పంచాంగాదికాభినయము పూర్తియైనది. ఆ సరోవరమును ప్రతీక్షించుచున్న గవాక్షమునందుఁ జిరుగాలులతో నాడుకొనుచున్నది.

వకు :- మీ యాదర విశేషమును తెలిపి యామెకు నుత్సాహము నినుమడించుదు. మరి నా కనుజ్ఞయా ?

గణ :- పద యీ లోపల నేనును పోయెదను.

(నిష్క్రమింతురు ఇది మిశ్రవిష్కంభకము)

(పిమ్మట సద్దుమణఁగిన పరిజనము, ఉత్తరముతో మంత్రియు సేవింపుచుండ రాజు ప్రవేశించును)

రాజు :- (ఉత్తరమునుఁ జూచుచున్న మంత్రినిఁజూచి) వాహతకా ! విదర్భరా జేమనుచున్నాఁడు ?

మంత్రి :- స్వామీ ! తనుఁగట్టఁ బ్రాఙ్లు తాఁ దెచ్చుకొనుచున్నాఁడు.

రాజు :- ఆ యుత్తరమును చదువుము.

మంత్రి :- ఆతఁడు వ్రాసిన దిది : మీరిట్లు సెలవిచ్చితిరి 'నీ పినతండ్రి కుమారుఁడు మాధవసేనుఁడు సంబంధ నిశ్చయముతో మా సన్నిధికి వచ్చునపుడు నీ గడిరాజు లాతని నాక్రమించిరి. మాకుఁగా నీ వాతనిని సపరివారముగా విడువవలయు' నని, దాయల విషయమై రాజుల యీ వైఖరి మీకుఁ గ్రొత్తకాదు. మీరు మధ్యస్థులుగా నుండుట మంచిది. ఇంతకును, ఆతని చెల్లెలా సందడిలోఁ దప్పిపోయినది. ఆమెను వెదకుటకై ప్రయత్నింపఁగలను. కాక మాధవసేనుని మీరు విడిపించికొనఁ దలఁచితిరేని యీ యొడంబడిక కంగీకరింపుడు.

మౌర్యసచివు నాదు మఱఁదిఁబట్టిరి మున్ను
వాని విడువనెంతురేని నేఁడు
విడుతు ననుజుతోడఁ బడతితో మాధవ
సేను మెఱయఁగా ననూనమైత్రి. 7

రాజు :- (రోషముతో) ఏమీ, అనాత్మజ్ఞత ? మాతో వంతులా ? వాహతకా ! వానికిని మనకును మొదటినుండియు నింతే. వాని నిర్మూలనమునకు ముందే సంకల్పించితిమికదా ? వీరసేనముఖమున దండనీతినిఁ బ్రకటింపుము.

మంత్రి :- చిత్తము.

రాజు :- నీ యుద్దేశ్యమేమి ?

మంత్రి :- ప్రభువులు రాజనీతి సమ్మతముగా సెలవిచ్చిరి.

నూతనప్రాప్త రాజ్యాధినేత యగుట
పాదుకొననేరఁ డింకనుఁ బ్రకృతులందు
వానిఁబెకలింప సుఖవు నవప్రరోప
శిథిలమూలమ్ము తరువుఁ గూల్చనవిధాన. 8

రాజు :- అటులే యగుగాక, ఇదియే కారణముగా సేనాపతి నుద్యోగింపుము.

మంత్రి :- చిత్తము. (నిష్క్రమించును)

(పరిజనము యథాపూర్వముగా రాజును సేవించుచుండును)

విదూ :- (ప్రవేశించి) ఇందాక రాజుగారు - అలవోకగా నాఁడు చిత్తరువున దర్శనమిచ్చిన మాళవికనుఁ జూచుట కనువైన యుపాయమును విచారింపు మనిరి. నేను గూడ దానిని సంతరించితిని. పోయి యాతనికి నివేదింతును.

రాజు :- (విదూషకునిఁజూచి) అడుగో నర్మసచివుఁడు గౌతముఁడు.

విదూ :- (సమీపించి) వర్ధిల్లుము.

రాజు :- (తలయూచి) ఇదిగో నాసనము.

(విదూషకుఁడు కూర్చుండును)

రాజు :- ఉపాయము గోచరించినదా ?

విదూ :- గోచరించినదా యేమి ? ఫలించినదా యని యడుగుము.

రాజు :- ఎట్లు ?

విదూ :- (చెవిలో) ఇట్లు.

రాజు :- బాగున్నది, లెస్సగా నారంభించితివి. నెరవేరుట యెట్లున్నను, నీ తంత్ర మాశాజనకముగా నున్నది.

నడుమ ప్రతిబంధమొక్కండు వొడమెనేని
కార్య మొనఁగూడు టది సాహ్యకారివలన
కన్నులుండిననే మంధకారపిహిత
దృశ్య మేర్పడ వలయును దీపకళిక. 9

(తెరలో)

చాలులే, ప్రగల్భాలు. ఎవరి యంతరువెంతో, అక్కడే తేలుతుంది.

రాజు :- (విని) అప్పుడే నీ పన్నుగడ పూఁచినది.

విదూ :- ఇంతలోనే ఫలింపవచ్చునుగూడ.

(కంచుకి ప్రవేశించును)

కంచు :- దేవా ! ఆజ్ఞా పరిపాలనము నమాత్యులు విన్నవించుచున్నారు. మఱి ఇరుగో హరదత్తగణదాసులు.

అభినయ విద్యాచార్యులు
నుభయులు నన్యోన్యజయ సముద్యోగమునన్
సభ కరుదెంచిరి 'నేఁడో
ప్రభు ! సాక్షాత్కార మొలయు భావమ్ములనాన్. 10

రాజు :- ప్రవేశపెట్టుము.

కంచు :- చిత్తము.

(నిష్క్రమించి యాచార్యులతోఁ బ్రవేశించును)

గణ :- (రాజునుఁ జూచి) ఓహో ! ప్రభువుల నిండుదనము దరియరానిది.

ఈనాఁడు మొదలుగా డితనిఁగాంచుట నాకు
సూనాస్త్రసంకాశ శుభమూర్తి యితఁడు
డాయంగనేల నెడందలో నలజడి
మాయురే ! అనుభావమహిత ప్రదీప్తి
మాలాతరంగ సంచాలనాభీల
కీలాలపతివోలె క్షితినాథమూర్తి
చూడంగఁ జూడంగఁ జూడ్కి కింకొక్క
జాడయై యనువిమేషమ్ము క్రేఁగయ్యె. 11

హర :- ఏమి తేజస్విత !

దౌవారికజనములచే
రా విడువంబడియు డాసి రాజానన తే
జో విద్ధాక్షత నెవరో
రావల దన్నట్టులై కరమ్ము వెఱపగున్. 12

కంచు :- (సమీపించి) అరుగో ప్రభువులు !

ఉభ :- దేవా ! విజయము.

రాజు :- స్వాగతము. అవిగో నాసనములు.

(ఇరువురునుఁ గూర్చుందురు)

రాజు :- నాట్యశిక్షా సమయమున నాట్యాచార్యు లిటు వచ్చిరి.

గణ :- అయ్యా ! వినండి. నేనును గొప్పవారియొద్దనే చదువు కొంటిని. ఆ నేర్చినవిద్యను ప్రదర్శించి "ఔ" ననిపించు కొన్నాను. దేవి నన్ను పరిగ్రహించినది.

రాజు :- ఔను. ఇప్పుడు దాని ప్రసక్తియేమి ?

గణ :- ఆ నన్ను ఈ హరదత్తుఁడు నలువురిలో నీతఁడు నా పాద ధూళికిఁ జాలఁడని తూలెను.

హర :- స్వామీ ! కయ్యమున కాయనయే కాలుదువ్వెను. ఆయన సముద్రమఁట ! నేను పడియనఁట ! కావునఁ బరీక్షకులగు ప్రభువులే తారతమ్య నిరూపణము చేయవలయును.

విదూ :- లెస్స. బాగుగాఁ గనుగొంటిరి.

గణ :- చాల బాగుగా నున్నది. ప్రభువు లవధానముతోఁ జిత్తగింపుడు.

రాజు :- కొంచెమాగండి. దేవి యన్యథా భావింపవచ్చును, పండిత కౌశికీ సన్నిధిని న్యాయ విచారణమంచిది.

విదూ :- బాగున్నది.

ఉభ :- ప్రభువుల చిత్తము.

రాజు :- మౌద్గల్యుఁడా ! ఈ వర్తమానమును నివేదించి పండిత కౌశికీసహితముగా దేవినిఁ దోడ్కొనిరమ్ము.

కంచు :- చిత్తము.

(నిష్క్రమించి సపరివ్రాజికయగు దేవితో ప్రవేశించును)

కంచు :- అమ్మా ! ఇటు యిటు.

ధార :- అమ్మా ! మీ కీ హరదత్తగణదాస వివాదమున నేమి తోఁచుచున్నది ?

పరి :- తోఁచుట కేమున్నది ! గణదాసుఁడు హరదత్తునకుఁ దీసిపోఁడు.

ధార :- అది యట్లే. ఐనను రాజాశ్రయ మతనికెక్కువ.

పరి :- నీవు రాణివికదా ?

ఇనపరిగ్రహమున ననఐందు నతిమాత్ర
భాసురాంశువగుచుఁ బ్రజలునేవి
తారకాధిపతికిఁ దనరునే ? కొదువ వి
శాపరిగ్రహ ప్రసన్నరుచికి. 13

విదూ :- అదిగో ! పండితకౌశికిని పురస్కరించికొని ధారణీదేవి.

రాజు :- ఔను. ఆమె

ధృతమంగళకలనాలం
కృతితా యతివేష కౌశికియు రా వేద
త్రితయము నధ్యాత్మము నా
కృతిమెలఁగినరీతి దేవి యెంతయు నొప్పెన్ 14

పరి :- (సమీపించి) ప్రభువునకు విజయము.

రాజు :- అమ్మా ! నమస్కారము.

పరి :-

సారప్రసవలు సన్మశో
దారక్షమలైనవారు దారలు నీకున్
ధారణిని భూతధారణి
నీరీతిని వర్షశతము నేలెదు గాకన్ 15

ధార :- ఆర్యపుత్త్రులకు జయము.

రాజు :- దేవీ ! స్వాగతము. (కౌశికినిఁ జూచి) అమ్మా ! కూర్చుండుడు.

(అందఱును గూర్చుందురు)

రాజు :- అమ్మా ! నాట్యాచార్యులు హరదత్తగణదాసులకు వివాదము కలిగినది. అందు నీవు నిర్ణాయికాపదము నధిష్ఠింపవలసియున్నది.

పరి :- చాలును పరిహాసము. పట్టణము చేరువనుండగాఁ బల్లెలోనా రత్నపరీక్ష ?

రాజు :- అదికాదు. నీవు పండితురాలవుకదా ! వారో మాకు వేలు వేలుగాఁ గావలసినవారు.

ఉభ :- ప్రభువులు చక్కఁగా సెలవిచ్చిరి. మధ్యవర్తినివై గుణ దోషముల నీమె నిర్ణయింపఁగలదు.

రాజు :- అసలు వివాదమేమి ?

పరి :- ప్రభూ ! నాట్యశాస్త్రము ప్రయోగప్రధానముగదా. ఇందు వాగ్వాదములతోఁ బనియేమి ? (ధారణివంకకుఁ దిరిగి) నీ యభిప్రాయమేమి ?

ధార :- నన్నడిగినచో వివాదమే మంచిదికాదు.

గణ :- దేవీ ! విద్యాధికుల వలన నోటమి నభిలషించెడి నన్ని ట్లవమానించుట తగదు.

విదూ :- ఇన్నాళ్ళనుండి దివాణమునఁబడి పొట్ట నింపుకొను చున్నారు. వీరికి జీతములిచ్చుట దండుగ. సంవాదమును జూచియైన వినోదింతము.

ధార :- కయ్యమన్నచోఁ జెవి కోసికొందువు.

విదూ :- అదికాదు. పరస్పర జయాభిలాషములైన మదపు టేనుఁగులు ఒకదానినొకటి నిలువనీయవు. అవి యూర కుండు టెట్లు ?

రాజు :- భగవతీ ! ఇరువురి యాంగికసౌష్ఠవము నెఱుఁగుదువు గదా ?

పరి :- తెలియకేమి ?

రాజు :- ఇంతకన్న వీరు వేఱుగాఁ జేయఁదగిన దేమి ?

పరి :- నేనును అదియే చెప్పుచున్నాను.

కడుఁ బ్రకాశింపఁ దనయందె కళ యొకనిది
శిష్యసంక్రాంతమై ప్రకాశించు నొకని
దుభయమొకరీతి వెల్గునే యొకనియందు
నిలుపఁదగు వాని మొదల నొజ్జలకు నెల్ల. 16

విదూ :- అయ్యా ! విన్నారుగదా కౌశికీవాక్యమును ? ఉపదేశ దర్శనమువల్లనే నిర్ణయము.

హర :- మాకుఁ బరమసమ్మతము.

గణ :- దేవీ ! పరిస్థితి యిది.

ధార :- శిష్యులు మందమతులై యుపదేశమును బాడొనరించినచో నాదోషము గురువులదా ?

రాజు :- అట్టి మందమతులను స్వీకరించుటలోనే గురువుల తెలివి వెల్లడియగును.

ధార :- (జనాంతికము) ఇపుడేలాగు ? (గణదాసునిఁ జూచి, ప్రకాశము) ఈ మనోరథమునుఁ దీర్పకపోయినచో నార్యపుత్రుల కుత్సాహము కొఱవడదు. నా మాటవిని నిష్ప్రయోజనమగు నీ యత్నమునుండి విరమింపుఁడు.

విదూ :- ఆమెచెప్పినది బాగున్నది. (గణదాసువంకకుఁ దిరిగి) ఎట్లో సంగీతాచార్యపదమును సంపాదించి సరస్వతీ ప్రసాదముల నారగింపుచు సుఖముగాఁ గాలక్షేపము చేయుచున్న మీకు దిక్కుమాలిన యీ వాదములెందుకు ?

గణ :- అమ్మగారి మాట కర్థమిదియే. సమయము వచ్చినది చెప్పుచున్నాను.

ఎవఁడు సుప్రతిష్ఠితుఁడ నాకేల వాద
మనుచు సడికోర్చి యొక్కట నణఁగియుండు
నెవని యాగమ మది జీవనైకఫలము
వాని విజ్ఞానపణ్యుని వణిజుఁడంద్రు 17

ధార:- ఇటీవలనే కదా మీ శిష్యురాలు నాట్యాభ్యాసమును మొదలు పెట్టినది. ఆమె ప్రదర్శనమును బాటించుట న్యాయము కాదు.

గణ :- అందువల్లనే నా కింత పట్టుదల.

ధార :- మీ రిరువురు కౌశికీ సమక్షములో నుపదేశమును ప్రదర్శింపవచ్చును.

కౌశి :- అది న్యాయముకాదు. సర్వజ్ఞుఁడైనను ఒక్కడు చేసిన నిర్ణయములో దోషములుండవచ్చును.

ధార :- (జనాంతికము) ఎంత మందమతివే! మెలఁకువగానున్న నన్నే జోకొట్టుచున్నావు గదా! (కోపముతో) మోము నావలకుఁ ద్రిప్పికొనును.)

(రాజు దేవినిఁగూర్చి పరివ్రాజికకు సంజ్ఞచేయును)

పరి :- మార్మొగమ్ము పెట్టి మరుగనేటికి
ఇందువదన! నెరసుగలదె ప్రభునియందు
కనలుటకును నొక్క కారణమ్మున్నచోఁ
బడకతీరదెందు పతులకైన 18

విదూ :- న్యాయమేకదా! ఎట్లైనను దనవారిని రక్షించికొనవలయును. (గణదాసునిఁ జూచి) దేవికోపము నిన్ను కాపాడినది. సుశిక్షితులైనంతమాత్రమున నెల్లరును బోధనా విషయమున సమర్థులు కారు.

గణ :- అమ్మా! వినుఁడు. లోక మిట్లే అనుకొనును.

వాదమయ్యెనేని నోదేవి! నావిద్య
కలిమి శిష్యులందు వెలయఁ గలదు
సెలవు లేదయేని కొలువు చాలించెద
నీ నవావమాన మేనుసైప

(లేచి పోఁబోవును).

ధార :- (తనలో) ఏమిగతి? (ప్రకాశముగా) శిష్యుల యోగక్షేమములు గురువులవి.

గణ :- (తనలో) ఊరక బాధపడితిని. (రాజును జూచి) దేవి యనుమతించినది. ఏ ప్రయోగము నిమ్మని సెలవు?

రాజు :- (కౌశికివంకకుఁ దిరిగి) ఆమె యనుజ్ఞ.

కౌశి :- ధారణి యేమో బాధపడుచున్నది. నాకు సందేహముగా నున్నది.

ధార :- నిశ్శంకముగాఁ జెప్పుము. పరిజనము ప్రభుజనాధీనముగదా!

రాజు :- నేనుఁ గూడ ననుము.

ధార :- అమ్మా! మీరు చెప్పుడు.

కౌశి :- ప్రభూ! చతుష్పదోద్ధమగు ఛలికమను శర్మిష్ఠాకృతి ప్రదర్శించుట కష్టమట. ఆ ప్రయోగనైపుణ్యమునుబట్టి వీరి యంతరమును నిర్ణయింతము.

ఉభ :- మీ యాజ్ఞ.

విదూ :- కావున రెండు వర్గములవారు నాట్యశాలలో పాట మొదలుపెట్టి మాకు వర్తమానము నంపుడు. ఈలోపుగా మృదంగధ్వని వినిపించినచో మేమే బయలుదేరుదుము.

హర :- అట్లే. (లేచును)

గణ :- (ధారణివంకఁ జూచును)

ధార :- (గణదాసునిఁ జూచి) నేను మీ విజయమునే కోరు చుందును.

ఉభ :- (బయలుదేరుదురు)

కౌశి :- అయ్యా! ఒకమాట.

ఉభ :- (మరలి) ఇదిగో!

కౌశి :- అధ్యక్షురాలనుగనుక చెప్పుచున్నాను. సర్వాంగసౌష్ఠవ వ్యక్తికై పాత్రములు నిరలంకారములుగాఁ బ్రవేశింప వలయును.

ఉభ :- ఇదియా మాకుఁ జెప్పునది?

ధార :- (రాజును జూచి) రాజకీయములయందీ యభిజ్ఞత యున్నచోఁ జాల బాగుండెడిది.

రాజు :- వేఱుగా మదినెంచి విహ్వలించెదవు
వీరేరుహాస్య ! నా నెరసు లేదందు
అమరుగా లోకమ్మునందు నెచ్చటను
సమవిద్యులకుఁ బరస్పర యశస్స్పర్థ 20

(నేపథ్యమున మృదంగధ్వని - అందఱునుఁ జెవియొగ్గుదురు)

కౌశి :- అప్పుడే పాట మొదలుపెట్టినారే ! నిజమే.
జీమూతస్తనితోహ మేఁచివఁ బరిస్విన్నాక్షి కోణమ్ము లా
శామార్గమ్ములఁబెట్టి సంశ్లథ మృదుచ్ఛాయా కలాపమ్ముతో
రా. మాయూర మతంద్ర మధ్యమ కృత ప్రారంభమై హారియై
వ్యోమాంతమ్ములయందుఁ బుష్కర రవవ్యూహమ్ము విండారెడిన్ 21

రాజు :- దేవీ ! సభకుఁ బోదము.

ధార :- (తనలో) ఏమి గడుసువనము !

(అందఱును లేచెదరు)

విదూ :- (ఏకాంతముగా) ధైర్యముగా పద, ధారణీదేవి యను మానింపవచ్చును.

రాజు :- అరిపేదమగు గుండె తిరమొనర్చితినెట్లొ
మురజఘోషము మరల పరియవాపెడివి
దవుల కోరిక సిద్ధి ధరణికి నెదుట
నవతరింపఁగ నైన యడుగు సవ్వడియొ ! 22

(అందఱు నిష్క్రమింతురు)

ప్రథమాంకము

మాళవికాగ్నిమిత్రము

ద్వితీయాంకము

(సంగీతరచనానంతరమున నాసనములపయి సవయస్యుఁడగు
రాజు ధారణియును పరివ్రాజకయును విభవోచితముగాఁ
బరిజనము ప్రవేశింతురు)

రాజు :- అమ్మా ! ముందెవరి ప్రయోగము ?

పరి :- ఉభయులు విద్యావృద్ధులైనను గణదాసులు వయోఽధికులుగదా!

రాజు :- మౌద్గల్యుఁడా ! ఆచార్యుల కిది విన్నవించి నీపనిలో నుండుము.

కంచు :- చిత్తము. (నిష్క్రమించును)

గణ :- (ప్రవేశించి) ప్రభూ ! లయమధ్యము చతుష్పదము నగు శర్మిష్ఠాకృతిని స్థిరచిత్తముతో నవధరింపుడు.

రాజు :- ఆచార్య ! సావధానుఁడను.

(గణదాసులు నిష్క్రమింతురు)

రాజు :- (జనాంతికముగా) చెలికాఁడా !

నేపథ్యాంతరగత యగు
నాపైఁదలిఁ జూడఁ జూడ్కి యత్యుత్సుకమై
ఆపిన యీ తెరచీర ప
టాపంచలుచేసి తా హటాహటిఁ జనునో !

విదూ :- (జనాంతికముగా) ప్రభూ ! జాగ్రత. విరిదేనె సిద్ధముగా నున్నది. తేనెటీగలు మ్రోయుచున్నవి.

(పిమ్మట నాచార్యులచేఁ బరిశీలింపఁబడుచున్న యాంగికముతో మాళవిక ప్రవేశించును.)

విదూ :- శిక్ష నిబద్ధమయ్యెను నీమె సౌందర్యము తరుగువోలేదు.

రాజు :- (జనాంతికము) చెలికాఁడా !

నాఁడు పటమునఁ దరుణిఁ గన్నట్టి నాకు
సరవిఁగాంతివిసంవాద శంక కలిగె
నీ తనూరేఖ లటుదీర్చె నెవ్వఁడతవి
నేఁదలంచెద శిథిలసమాధియనుచు. 24

గణ :- అమ్మా ! భయము వదలి సరిగా నిలువుము.

రాజు :- (తనలో) సౌందర్య మే పరిస్థితులయందునుఁ బ్రకాశించును.

కనులాయతమ్ము లాననము శారదచంద్ర
సమకాంతి బుజము లంసానతములు
నిబిడోన్నత స్తన విభృత మురమ్ము పార్శ్వములు
ప్రమృష్టభావమునఁ దనరు
నెఱిగొను హస్తాంత పరిమిత మ్మతిమాత్ర మగు
జఘనమ్మును పదుగుగవ య
రాఁగాంగుళియు నైన రమణి యాచార్యుని
మదిలోన హత్తిన మధుర భావ

భంగి తానెట్టు లటుల మలంగ మేను
విలిచె రంగస్థలమ్ము వెన్నెలలుగా న
నంగ మంత్రాధిదేవత యనఁగ నయన
నిర్వృతి రసైక సంస్థాన నిరతిశయత. 25

మాళ :- (ఉపగానమొనర్చి చతుష్పద ప్రబంధమును పాడును)

కాంతుండు దుర్లభుఁడు గదవె యాతనివంక
స్వాంతమా ! యడియాస చాలు నీ కింక
హా ! యిదియేల వామాక్షి మూరక కెరల
డాయునో ! కోరిక డాపట వరల 28
అయ్యెఁబో యిన్నాళ్ళకయ్యెఁ జూడఁగను
ఏ యుపాయమ్ము ప్రాపించు కూడఁగను
నాథ ! నీయందునను నాటినది మది, నే ప
రాధీనఁ జాలనురా ! వెతలసైప

(పిమ్మట రసానుసార మభినయించును)

విదూ :- ప్రభూ ! చతుష్పద ప్రబంధ ద్వారమున నీమె నీయం దాత్మనివేదన మొనరించికొనుచున్నది.

రాజు :- మా యూహయు నంతే.

నన్ననురక్తగా మనమునం దలపోయు మటంచుఁ దా రసా
భ్యున్నతిఁ గన్నెచే నభినయోదిత మైన తెలుంగు ధారణీ
సన్నిధిలోన నా వలపుచంద మెఱుంగమిఁ బ్రార్థనా పరి
స్విన్నదృగంతమౌ మనవి సెప్పినయట్లు మదిం గరంచెడిన్ 28

(గీతాంత మున మాళవిక విష్క్రమింపఁ బోవును)

విదూ :- కొంచెమాగుము. (గణదాసునితో) మీరొకటి మరచినారు.

గణ :- అమ్మా! క్షణము నిలువుము. పూజ్యుల యభిప్రాయమును విని పోయెదవు.

(మాళవిక మరలివచ్చి నిలుచును)

రాజు :- (తనలో) చెలువము సర్వదశలయందునఁ గ్రొత్త సోయగమును వెలయించును. అట్లేకదా!

మణిబంధ నిభృత కంకణమైన దాపలి
చిగురుఁగేలు నితంబసీమఁ జేర్చి
మాధవీ విటప కోమలము దక్షిణపాణి
సరసిజాతమ్మును జేరవిడిచి
పాదాంగుళీ ధృత ప్రసవ మండన మైన
కుట్టిమమ్మునఁ జూడ్కిఁ గుదురుకొలిపి
ఋజ్వాయతార్ధ విభృతదేహయష్టియై
నిలిచిన నిలుకడ వెలయునట్టి
విలసనమ్మొకందు లలితాంగి రంగము
నందు నెరపినట్టి యఖిలవిద్య
యొకఁడు నొక్కటియగు నొండెవి నిలిచిన
తీరునందు వెలయు సౌరె మిగుల. 29

ధార :- గౌతముని మాటకూడ మీరు పాటింపవలయునా!

గణ :- అమ్మా! అట్లనరాదు; ప్రభువుల సహవాసమునుబట్టి యతఁడును సూక్ష్మదర్శి కావచ్చును. చూడుము.

మతిహీనుఁడైన సత్వం
గతిఁ దనరెడునేని ధీప్రకాశము నందున్
కితకాఫల యోగమ్మున
నతి కలుషాంబువులు దేటలైన విధానన్. 30

(విదూషకునిఁ జూచి) ఓయీ ! నీవు చెప్పఁదలఁచినదేమి ?

విదూ :- ముందు పరివ్రాజిక నడుగుము. తరువాత నేను చెప్పెదను.

పరి :- చూచినంతవరకు దోషము లెచ్చటను లేవు.

అంతర్నిహిత భాష లంగకమ్ముల చేత
భావమ్ము సూచింపఁబడుట లెస్స
పాద విన్యాసమ్ము పరిగత లయము
రసాంతరమ్ములఁ దన్మయత కడింది
శాఖానుసార ప్రసక్త మ్మభినయమ్ము
నతి మృదువగును భేదానుగతిని
విషయమ్ము నందుండి వెడలించెడిని భావ
మన్యభావమ్ము నట్లయ్యుఁ గూడఁ

జెడదు రంజనావిశేష మించుకయును
నతివ తాను నెరపినంతవట్టు
విద్య యెల్ల దోషవిరహితయును రసో
ల్లాసితయును సుప్రకాశితయును. 31

గణ :- ప్రభువుల చిత్తమెట్లో ?

రాజు :- మా పక్షమును వదలికొనినట్లే.

గణ :- ఇప్పటికిఁగదా ! నృత్యోపదేశకుఁడను.

ఎవని నేర్పు కమలదించుకయును(బరీ
క్షలకు(దాళి విబుధజనుల యెదుట
వాని నేర్పె నేర్పు వహ్నినిక్షిప్తమై
చాయ కగ్గనట్టి స్వర్ణమట్లు. 32

ధార :- దైవముచే నాచార్యుల యశస్సు అక్షతమై వెలయు చున్నది.

గణ :- మీ యాశ్రయమే దీనికి మూలము (విదూషకుని(జూచి) నీవనుకొన్నది తెలుపుము.

విదూ :- ప్రయోగారంభమున బ్రాహ్మణుని సంభావింపవలయును. అది మరచితిరి.

పరి :- ఇదికూడ ప్రయోగములోనిదే ?

(అందఱు నవ్వుదురు. మాళవిక యల(తిగా నవ్వును)

రాజు :- చూడ(దగినది చూచితిని.

దరహాస దళిత లలితా
ధర కించి ల్లక్ష్యమాణ దశన ముకుర భా
సుర వదనము విదళత్కే
సర రుచిరోదర సరోజ సదృశరుచి(దగున్. 33

గణ :- బ్రాహ్మణు(డా ! ఇదియే మొదలుకాదు; లేనిచో నిన్నేల యుపేక్షింతుము !

విదూ :- అయ్యో ! ఉరుమువిని జలాశచే నింగికి నోరు తెరచి కొన్న బెగ్గురుపక్షి నైతిని. పరప్రత్యయనేయబుద్ధులము మాకేమి తెలియును ! ఆమె చాల బాగున్నదనుటచే నీ కిది

బహూకరించుచున్నాను. (రాజుచేఁతినుండి కంకణమును లాగును)

ధార :- ఆగుము. ఎదిరిగుణము నెఱుఁగకుండ బహూకరింపరాదు.

విదూ :- నాది కాదుగదా !

ధార :- (గణదాసునిఁజూచి) మీ శిష్యురాలి ప్రదర్శనమైనదికదా !

గణ :- అమ్మా ! పోదము రా. (మాళవికతో నిష్క్రమించును.)

విదూ :- (జనాంతికము) ప్రభువులను నా బుద్ధికొలఁది సేవించితిని.

రాజు :- ఎంతమాట ! నాకిప్పుడు

అక్షియుగళంబునకును భాగ్యాస్తమయము
డెందమునకు మహోత్సవానంద విరతి
ద్రుత కవాట పిధానంబు ధృతికి నతివ
యవనికాంతః ప్రవేశంబు నాత్మఁదలఁప. 34

విదూ :- దరిద్రుఁడైన రోగి వైద్యునిమీఁద వలె నాపై నాశ పెట్టుకొన్నావు.

హర :- (ప్రవేశించి) ప్రభూ ! నా ప్రయోగమును గూడఁ దిలకింపుడు.

రాజు :- (తనలో) చూడవలసినది ముగిసినది. (ప్రకాశము) మాకుఁ జూడవలెననియే యున్నది.

హర :- అనుగ్రహము.

(తెరలో)

దేవా ! జయము జయము మధ్యాహ్నము కావచ్చినది.

కోనేళ్ళ నెండతాఁకునకుఁ దామరనీడ
మొగుడుఁ గన్నుల హంసములు మలంగె
మేడల ముంజూర్ల మెలఁగడు లోలోనె
కునుకు పారావతకులము కెరల
దుత్కీర్ణ శీకరబిందువు వారియంత్రమ్ము
చుట్టు నూరక నెమ్మి సుడియు డప్పి
నడిమి మిన్నులలోన నళినబంధు వాకింత
విలిచి విప్పుఁబ్రగాపె నిఖిలదిశల

నవసరమ్మయ్యె దేవ! మధ్యాహ్నసమయ
విహిత విధికలాపము నెరవేర్చుటకును
నృపతి గుణరాశి వైన నీ యుపమఁ బేర్చి
వేవెలుంగులు నిండార వెలసె వినుఁడు. 35

విదూ :- అమ్మో! అమ్మో! మాకు భోజనవేళ యయినది. ప్రభువులకు వేళ మించినచో వైద్యులొప్పికొనరు. (హరదత్తునిఁ జూచి) మీ మాటేమిటి?

హర :- ఇంకొక మాటకు వీలున్నదా?

రాజు :- మీ ప్రయోగము రేపు. ఇప్పటికి విరమింతము.

హర :- చిత్తము. (నిష్క్రమించును)

ధార :- ఆర్యపుత్రు లిఁక స్నానవిధిని నిర్వర్తింపుడు.

విదూ :- నేఁడు భోజనము సవిశేషముగా నుండవలయును.

పరి :- (లేచి) స్వస్తి. (దేవితో నిష్క్రమించును)

విదూ :- ప్రభూ! రూపముననేకాదు, విద్యలోఁగూడ మాళవిక నిరుపమానురాలు.

రాజు :- చెలికాడా !

సకియ కవ్యాజమధురత చాలనట్లు
దానిపయిఁగూర్చి లలితవిజ్ఞానమకట
అంబుజభవుండు చేసె పంచాధికముగ
నతనుమూర్తికి విషదిగ్ధమైన శరము 36

వేయేల ! నా పరిస్థితి విచారింపఁదగినది.

విదూ :- నీవుగూడ నా యవస్థను విచారింపుము. అంగడిలోని మూసవలె నా కడుపు మాడిపోవుచున్నది.

రాజు :- ఇట్లే మిత్రకార్యమున నీవు శ్రద్ధవహింపవలయును.

విదూ :- దక్షిణ తీసికొన్నాను. కాని మేఘావరోధమున వెన్నెల వలె నామె మనకిఁక కనుపడదు. నీవు మాంసవిపణిని గ్రద్దవలె ఆశను వదలుకొనలేవు; సాహసింపనులేవు. కార్యసిద్ధినిఁగూర్చి ప్రతీక్షింతువు.

రాజు :- నాకెక్కడి స్థాయి !

నిఖిలాంతఃపుర వనితా
సుఖగోష్ఠి రసభరైక సుస్థితికిఁ బరా
జ్ముఖవృత్తినైన నామది
సఖి యొక్కతి నిల్చె స్నేహసారవసతియై. 37

(అందఱు నిష్క్రమింతురు)

ద్వితీయాంకము

మాళవికాగ్నిమిత్రము

తృతీయాంకము

(పిమ్మట పరివ్రాజికాపరిచారిక సమాహితిక ప్రవేశించుచున్నది)

సమా :- సమాహితికా! రాజుగారి తోటలోనికిఁ బోయి జామ పండ్లు కొనితెమ్మని పరివ్రాజిక యాజ్ఞాపించినది. ఇప్పుడు మధుకరికను వెదుకవలయును. (పరిక్రమించి) అదిగో మధుకరిక! రక్తాశోకము నవలోకించుచున్నది. పోయి చూచెదను.

(ఉద్యానపాలిక ప్రవేశించును)

సమా :- మధుకరికా! నీకీ యుద్యానపాలనము సుఖముగా నున్నదా?

మధు :- ఓహో సమాహితికవా! నీకు స్వాగతము.

సమా :- రాజ్ఞీదర్శనమున కేమేనిఁ గొనిపోవలయును గాన జామ పండ్లు కొనితెమ్మని నేఁడు పరివ్రాజిక యాజ్ఞాపించినది.

మధు :- ఇవిగో నిచ్చటనే యున్నవి. అవునుగాని యా నృత్య శిక్షకులలో పరివ్రాజిక యెవరిని ప్రశంసించినది?

సమా :- ఇరువురును శాస్త్రజ్ఞతయందేమి, ప్రయోగనైపుణ్యము నందేమి సమానులేనఁట. శిష్యురాలినిఁబట్టి గణదాసునకుఁ బ్రశస్తివచ్చినది,

మధు :- మాళవికనుగూర్చి లోకమేమి చెప్పుకొనుచున్నది?

సమా :- ప్రభువున కామెపయి అభిలాష మిక్కుటమఁట. పైకి మాత్రము ధారణీదేవి యేమనుకొనునో యని వట్టి దొర

తనమును ప్రదర్శించును. కొన్నినాళ్ళనుండి మాళవిక వడలిన మాలతీదామమువలె కనుపించుచున్నది. ఇంతకు మించి నాకు తెలియదు; నన్ను వదలుము.

మధు :- ఇదిగో? ఈ కొమ్మకు ప్రేలుచున్నది. జామపండు నందికొనుము.

సమా :- అలాగే (జామపండు నందికొని) ఈ సాధుసేవ ఇతోధికముగా నీకు ఫలింపఁగలదు. (బయలుదేరును)

మధు :- కలిసియే పోదము. అదనైనను, ఈ రక్తాశోకమేలనో పూఁత పట్టలేదు. దోహదము చేయింపవలసి యున్నదని దేవికి విన్నవింపవలయును.

సమా :- బాగున్నది. ఈ పరామరిక నీదేకదా! (నిష్క్రమింతురు)

ఇది ప్రవేశకము

(విరహియగు రాజు, విదూషకుఁడును ప్రవేశింతురు)

రాజు :- (తనపైఁ జూపు నిగిడ్చి)

దయితాలింగన సౌఖ్యదూరము కృశత్వమ్ముందుతన్ మేను తా
నయనద్వంద్వ ముదగ్ర బాష్పమగుతం దద్దర్శనాయాసియై
పయి నీకేల దురంతవేదన పడన్ స్వాంతంబ! నీ వెన్నఁడే
నియునున్ బాసి యెఱుంగవే! మృగదృశన్ నిర్వాణమేలందవో?

విదూ :- అధీరోచితమగు నీ వైక్లబ్యమేమి? మాళవిక నెచ్చెలి వకుళావళిక నాకుఁ గనుపించినది. నీ సందేశమును గూడ నామెకు వినిపించితిని.

రాజు :- విని యేమన్నది?

విదూ :- ఈనిదేశముచే దాసి యనుగ్రహింపఁబడినదని భట్టారకు నకు నివేదింపుమన్నది. మరియును నాగరక్షితమగు నిధి వలె ధారణీదేవి పరామరికలోనున్న యామె యనుకొని నంత సులభురాలు కాదు. ఐనను ప్రయత్నించెదనని చెప్పినది.

రాజు :- స్వామీ సంకల్పభవా ! ఏమి నీ చాతుర్యము ! అంత రాయబహుళములగు విషయములందు మనస్సునుఁ జొనిపి తుదకు నిలుపోపమిని ఘటింతువు. (విస్మయముతో)

హృదయ పుటప్రమాథి యగు నీ వ్యథ యేడ ! విసర్గసాధు వా
యుధము లతాంత మేడ ? నిద యున్నదె యింత విరుద్ధ మేయెడన్
మృదువని దేని నెంతు మదియెల్ల నుఁ దీక్ష్ణతరమ్మటంచు ను
న్నదిగద ! లోకవాదము కనంబడె నీయెడ సార్థకమ్ముగాన్. 39

విదూ :- చెప్పితినిగదా ! కొంచె మోపికపట్టినచో నెట్లు ?

రాజు :- ఏపనికినిఁ బాలుపోని మనస్సుతో నెచ్చటఁ బ్రొద్దు పుత్తును ?

విదూ :- ఇప్పుడేకదా ! ఎఱ్ఱగోరంటల తొలిపూఁత కానుకగా వసంతఋతువు వచ్చినదను మిషతో నిరావతి, "ఆర్యపుత్రు లతోఁ గలసి దోలారోహణసుఖ మనుభవింప వేడుక" యని నిపుణికాముఖమున నీకు వార్తనంపినది. నీవును సరి యంటివి. ప్రమదవనమునకే పోదము.

రాజు :- ఇది మంచిదికాదు.

విదూ :- ఎట్లు ?

రాజు :- ఆడువారు అసలే గడుసరులు. ఉపచారము లెన్ని పలికినను, నా పరధ్యానము నామె గమనింపకపోదు. కావున,

మానుటయు మంచి దుపవన యాన మందుఁ
గారణమ్ము లనేకముల్ గలవు గాన
నడిపినను మిక్కుటముగ మానవతులందు
భావజ్ఞానోపచారమ్ము పదను గాదు. 40

విదూ :- ఒక్కమాటలో రాణివాసము మీఁది యిన్నాళ్ళ దాక్షిణ్యమును వెనుకకుఁ ద్రోయుట నీకు న్యాయము కాదు.

రాజు :- ఉపవనమునకే దారితీయుము.

విదూ :- ఇటు యిటు. (పరిక్రమింతురు)

విదూ :- గాలికిఁ గదలుచున్న చివురువ్రేళ్ళతో నీ యెలదోట నిన్ను త్వరగా రమ్మనుచున్నది.

రాజు :- (స్పర్శము ననుభవించి) ఋతువు నిండుగాఁ బట్టినది. చూడుము.

కల మద హారి కోకిల నికాయ గళోత్థ మహాః కుహూ రవ
చ్ఛలమున నంగజ వ్యథకుఁ జాలిఁ బడన్ వలదంచుఁ బల్కెనో ?
లలిత వనామ్ర ధూళి విచల న్నవసౌరభ వీచి దక్షిణా
నిల మనుకేల నామనియె నెమ్మది నాయొడలందుఁ దాఁకెనో ! 41

విదూ :- నేవఁ దేరుదువు గాని పద. (ప్రవేశింతురు)

విదూ :- ప్రభూ ! కలయఁజూడుము. నిన్నుఁ గైవసము చేసికొనుటకేమో చెలువల సవరణకు సిగ్గుగా వసంతుఁడు

తెచ్చిన పూలసవరణలో నీ యుపవనలక్ష్మి మురిసిపోవుచున్నది !

రాజు :- అచ్చెరువగుచున్నది.

తరుణారుణాశోక సురచిర ప్రభఁజేసి
బింబాధరా లక్తకంబు మిగిలి
నీలా వదాతారుణాలోల కురవక
శ్రేణిమై తెగడి విశేషకమ్ము
లగ్న ద్విరేఫ మాలా కజ్జల ద్యుతి
తిలకమ్ముతో సాఁటి తిలక రచన
మధు సమాసాదిత మదరాగ లలిత
పల్లవముల రుచిఁ గపోలముల గీటి
అంగనా జన ముఖమండనాధిక ప్ర
శస్తిఁ దాల్చిన లీల వసంతలక్ష్మి
చూడ నొప్పారె పరితః ప్రసూన శబల
భాసురోద్యాన ధరణీ విభాగములను. 42

(ఇరువురు నుపవనశోభ నవలోకింతురు. ఉత్కంఠితయగు మాళవిక ప్రవేశించును)

మాళ :- అతని మనస్సేమో నాకుఁ దెలియదు. నా మనస్సాతని యందే పరిభ్రమించుచున్నది. తలంచినచో నాకే సిగ్గగుచున్నది. ఏమని చెలులకుఁ జెప్పుదును ? ఈ వేదన యెంతకాలమో ? (కొన్ని యడుగులు వైచి) ఎచ్చటికి బయలుదేరితిని ? (స్మృతి నభినయించి) అవును దేవికదా చెప్పినది. "మాళవికా ! గౌతముని చిలిపితనమున

నూయెల నుండి జారుటచే నా కాలు బెణఁకినది. కావున నీవు రక్తాశోకమునకు దోహదమొనరింపుము. ఐదు రాత్రులలో నది పూఁచినచో నీ కభీష్టసిద్ధి కాగలదు" అని. నే నచ్చటికిఁ బోవునంతలోఁ జరణాలంకారములనుఁ దీసికొని వకుళావళికయు రాఁగలదు. నేనీ యొంటిపాటున దిగులు వెళ్లఁబోసికొందును. (పరిక్రమించును)

విదూ :- ఓహో! కల్లుత్రావి మొగము మొత్తినవానికిఁ గండ చక్కెర దొరికినది.

రాజు :- అంటే ?

విదూ :- అడిగో మాళవిక. నిరాభరణ సుందరి యగు నామె మొగ మౌత్సుక్యమును వెల్లడించుచున్నది.

రాజు :- (హర్షముతో) ఆమెయా!

విదూ :- వే ఱెవరు!

రాజు :- బ్రతికితిని.

అంచయెలుఁగు నాలకించి దాపలి యేటి
జాఁడ దెలియు బాటసారివోలె
నీ వెలుంగఁజెప్ప నీరజముఖిరాక
కందువాసి నాదు డెంద మలరె. 43

ఆమె యెచ్చట ?

విదూ :- ఆ చెట్లచాల్పునుండి యీవైపే వచ్చుచున్నది.

రాజు :- (చూచి హర్షముతో) గౌతమా! ఆమెనే చూచుచున్నాను.

ఉపచితము శ్రోణి నడుమున
నపచితము సమున్నతము స్తనాభోగమునన్
విపులతమము లోచనముల
నుపేతమిదె నాదు జీవితోత్సవ మెదుటన్. 44

గౌతమా ! ఈమె మొన్నటికన్న మనోహరముగానున్నది.

శర విపాండు కాండ సరసకపోలము
లలఁతినగలఁ దాను వతివ దనరు
నెండ కారులోనఁ బండుటాకు లలంతి
పూవులైన మొల్లతీవ సాటి. 45

విదూ :- మీ కిరువురకు నొకేవ్యాధి సోకి నట్లున్నది.

రాజు :- నీ సౌహార్ద మెంతది ?

మాళ :- అదిగో సుమాళమగు దోహదము మీఁది యపేక్షతో నింకను పూవు తొడుగని యీ యశోకము బెంగగొనిన నావలెనేయున్నది. చట్టమగు దీని నీడలోఁ జల్లని యీ చాతి పలకపైఁ గూర్చుండి వినోదింతును.

విదూ :- వింటివా ఆమె యేమనుచున్నదో ?

రాజు :- ఇంతలో నేమయినది ? నీ యూహ సరికాకపోవచ్చును.

కొల్లలాడి ధూళి గోరంటపువ్వులఁ
జిగురు జొంపములనుఁ జీల్చి తుంపు
రులనుఁ గురియుచున్న వలిగాలి యొనరించుఁ
జిత్తవికృతి విర్నిమిత్తముగను. 46

(మాళవిక కూర్చుండును)

రాజు :- మనమీ తీవలమాటున నుందము.

విదూ :- ఎవరా వచ్చునది, ఇరావతియా ?

రాజు :- కమలవనమునుఁ జూచిన యేనుఁగు మొసలిని పరిగణింపదు.

(చూచుచుండును)

మాళ :- హృదయమా ! పాదుకొనని యీ కోరికల కెగఁబ్రాఁకకుము. ఎందుకీ ప్రయాస ?

(విదూషకుడు రాజువంకఁ జూచును)

రాజు :- ప్రేయసీ ! స్నేహ మెంతచెడ్డదో చూడుము.

చిత్త వికృతికిఁ గతమేమొ చెప్పవీవు
తర్కమును గాదు తత్త్వబోధైకఫలము
అట్టులయ్యునుఁ బరిదేవితార్థములకు
వేన లక్ష్యంబ ననుచు నూహింతునేమి ? 47

విదూ :- నీసందేహ మిప్పుడే తీరును. సందేశహారిణి వకుళావళిక యదిగో.

రాజు :- ఆమె కిదియే పనియా ?

విదూ :- ఎంతమాట ? ప్రభువుల సందేశమునే మఱచుచున్నదా ? నేనే మఱువనుగదా ?

(నూపురములతో వకుళావళిక వచ్చును)

వకు :- మాళవికా ! ఏమనుచున్నావు ?

మాళ :- వకుళా ! వచ్చితివే ?

వకు :- (కూర్చుండి) ఇన్నాళ్ళకు నీవే చేయఁదగిన పని వచ్చినది. ఏదీ? ఆ కాలిటు తెమ్ము. పారాణిపెట్టి మంజీరమును దొడిగెదెను.

మాళ :- (తనలో) హృదయమా! ఉవ్విళ్లూరకుము. ఈ వైభవ మెంతసేపటిది? ఇదియే యంతిమాలంకృతియేమో?

వకు :- ఏమా యాలోచన? పూఁతపట్టిన యీ యశోకమును దర్శించుటకు దేవి మిగుల నుబలాట పడుచున్నది.

రాజు :- ఈ సన్నాహమంతయు నశోకమును గుసుమింపఁ జేయుటకా!

విదూ :- నావల్లనే గదా, దేవేరులు ధరించెడి నగల నీమె తాల్చుట?

మాళ :- వకుళా! మన్నింపుము. (పాదమును జాపును)

వకు :- నీవు నా శరీరమవు. (అలంకరించును)

రాజు :- గౌతమా!

అతివ చరణాంబుజమ్మున కలరువెట్టి
నవధరించితె? తరుణ లాక్షార్ద్రరేఖ
భవ వివిర్దగ్ధ మన్మథ పాదపమున
మరల మోసెత్తెఁ జివురు జొంప మ్మొకండు. 48

విదూ :- ఈమె చరణముల యొప్పిదమునకుఁ దగిన దీ యుద్యోగము.

రాజు :- చక్కఁగాఁ జెప్పితివి.

లలిత నఖద్యుతి యడుగుం
దలిరుం దలఁదాల్ప రెండె తగు విన్నాళ్లై
యలరులు లేని యశోకము
చెలువుని యపరాధ నమిత శీర్ష మొకండున్. 40

విదూ :- అపరాధివైన నీకి బహూకృతి తప్పదు.

రాజు :- బ్రాహ్మణుఁడవైన నీ వచన మాశీర్వాదముగా నొదలఁ దాల్చుచున్నాను. నీవు సత్యదర్శివి.

(మదాలసయగు ఇరావతి చేటితోఁ బ్రవేశించును)

ఇరా :- నిపుణికా ! స్త్రీలకు మదవిభ్రమము విశేష శోభావహ మఁటగా ?

నిపు :- మొదట లోకోక్తిమాత్రమే. ఇప్పుడు నిజమయినది.

ఇరా :- ప్రియోక్తు లాడఁకుము. ఆర్యపుత్రులు డోలాగృహమునకు వచ్చినది తెలియుట యెట్లు ?

నిపు :- మీయందలి యానుకూల్యమువలన.

ఇరా :- చాలునులే నిజము చెప్పుము.

నిపు :- "భట్టినీ ! వేగరమ్మ" అని గౌతముఁడు చెప్పనే చెప్పెనుగదా ? అతఁడు కేవలము బహుమానప్రియుఁడు.

ఇరా :- ఓసీ ! మదాలసనైన నన్ను ప్రియదర్శనమునకు హృదయము వేగిరపెట్టుచున్నది. అడుగుపడుట లేదు.

నిపు :- డోలాగృహమునకు రానేవచ్చితిమి.

ఇరా :- ఆర్యపుత్రులో ?

నిపు :- అమ్మా ! పరికింపుము. వినోదమునకై ప్రభువు లెందేని దాఁగి యుందురు. శ్యామాలతా పరివేల్లితమగు నీ యశోకపు నీడను విశ్రమింతము.

ఇరా :- సరే.

నిపు :- (చూచి) మామిడిచిగురునకుఁ బోగాఁ జీమలు కుట్టినవి.

ఇరా :- అది యేమే ?

నిపు :- అదిగో ! అశోకమునీడ వకుళావళిక మాళవికా చరణముల నలంకరించుచున్నది.

ఇరా :- ఇచ్చటికి మాళవిక రాకూడదే ! ఏమయియుండును ?

నిపు :- ధారణీదేవి యూయెలనుండి పడి కాలు బెణఁకుటచే నశోక దోహదమున కీమెను నియోగించియుండును. కానిచో నామె మంజీరము లీ దాసీల కెక్కడివి ?

ఇరా :- దేవికి దీనియం దెంత బహుమానము !

నిపు :- రాజుగారేరి ?

ఇరా :- ఓసీ ! నా కడుగు పడుటలేదు. కన్నులు తిరుగుచున్నవి. దీని సంగతిఁ దేల్చికొందును. (మాళవికనుఁ జూచి తనలో) నాకీ యలజడి యిందుకే కాబోలును !

వకు :- (మాళవికకుఁ జరణమును జూపి) బాగున్నదా ?

మాళ :- నా చరణమగుటచేఁ బ్రశంసింపఁజాలకున్నాను. ఈ ప్రసాధనము నెచ్చట నభ్యసించితివి ?

వకు :- ప్రభువులే నాకు శిక్షకులు !

విదూ :- గురుదక్షిణకై దీనిని తొందరింపుము.

మాళ :- గర్వమే యెఱుఁగవు.

వకు :- నేర్చినదానికి వినియోగ మిపుడు కలిగినదిగాన గర్వపడవచ్చును. (పారాణి చూచి తనలో) నాదూత్యమిప్పటికి నెరవేరినది. (ప్రకాశము) ఇప్పటి కొక కాలి యలంకరణము పూర్తియైనది. ఊఁదికోనినచోఁ దడియారును. అంతవరకేల? అసలీ గాలికే యారిపోవును.

రాజు :- గౌతమా? చూడుము -

తరుణి లాక్షారసార్ద్రిమౌ చరణ సరసి
రుహముఁ దడియార్ప నిడుదయూర్పులు నిగిడ్చి
నాకు మిగులంగఁ గోర్కె యున్నదిగదోయి
ప్రథమ సేవావకాశ మియ్యది జుణింగె 60

విదూ :- నీకీ నిర్వేదమేల? నీ యభీష్ట మచిరకాలములోనే సిద్ధించును.

వకు :- నిండార విరిసిన కెందామరవలె నున్న యీ చరణముతో, పతి యంకతలము నధిష్ఠింపుము.

(ఇరావతి విపణికవంకఁ జూచును)

రాజు :- ఈ దీవన నాకు.

మాళ :- కానిమాటలాడకుము.

వకు :- ఐనమాటయే చెప్పితిని.

మాళ :- నీకుఁ గూర్చుదానను గదా?

వకు :- నాకేనా ?

మాళ :- మరింకెవ్వరికి ?

వకు :- గుణానురక్తుఁడగు ప్రభువునకుఁగూడ.

మాళ :- అబద్ధము. అదియే నాదగ్గఱలేదు.

వకు :- ఔను నీదగ్గఱలేదు. విరహ పాండురమగు ప్రభు శరీరమునందెల్ల వెల్లడియగుచున్నది.

నిపు :- దుర్మార్గురాలు. ఈ సమాధానమును ముందే యాలోచించి కొన్నది.

వకు :- వలపును వలపుచేతనే గ్రహింపవలయునను మాట పాటింపుము.

మాళ :- కనుక తోఁచినట్లెల్ల మాటలాడుటయే ?

వకు :- ఇవి నా మాటలు కావు. నీకై కలవరించు చున్న ప్రభువు నోటినుండి వచ్చినవి.

మాళ :- ధారణీదేవిని తలంచినచో నన్ను నేను నమ్మలేక పోవుచున్నాను.

వకు :- పిచ్చిదానా ! తుమ్మెదలకు బెదరి యలకాభరణమగు చూతమంజరి నెవరుపేక్షింతురు ?

మాళ :- ఈ విపన్నురాలికి నీవే శరణ్యమవు.

వకు :- వకుళమాల నలఁగినకొలఁది పరిమళించును గదా !

రాజు :- వకుళా ! చక్కఁగాఁ జెప్పితివి,

భావమునెఱింగి పిమ్మట పలుకు గలిపి
మొదవు శంకకు నిడి యుచితోత్తరమ్ము
సకియ విల్పతి మన్నిదేశమున నీవు
కామి యసువులు దూతికా కరగతములు. 51

ఇరా :- ఓసీ! చూచితివా? వకుళావళిక యప్పుడే మాళవిక నార్యపుత్రులతోఁ జతకట్టినది.

నిపు :- ఔను అధికారము గలదికాబట్టి.

ఇరా :- నా యనుమానమునకుఁ గారణము లేకపోలేదు. అంతయు విని యాలోచింతును.

వకు :- ఇదిగో! రెండవకాలి యలంకరణముగూడ ముగిసినది. ఇఁక మంజీరమునుఁ దొడుగవలయును. (తొడిగి) దేవి నియోగమున నశోకమును గుసుమింపఁజేయుదుగాని. లే!

ఇరా :- దేవీ నియోగమా? కానీ.

వకు :- మాళవికా! నీ యెదుటఁ జూడుము. (చెవిలో నెమ్మదిగాఁ జెప్పును)

మాళ :- (హర్షముతో) ఎవరు?

వకు :- (నవ్వుచు) ప్రభు వనుకొంటివా? అశోకశాఖాలంబియగు పల్లవగుచ్ఛము. దానినిఁ దలఁ దుఱిమికొనుము.

(మాళవిక విషాదము నందును)

విదూ :- వింటివా?

రాజు :- కామిజనమున కిదియే పదివేలు.

హృదయ ముత్కంఠితమ్ముకాదేని యార్తిఁ
బొగుల రేవియు నది యొక్క పొందె। యెందు
సంగమాశా నితాంత నాశమున నొదవు
మరణమును మేలు సమరాగ భరితులకును. 52

(పల్లవా వతంసితయై మాళవిక యశోకస్కంధమున పాదము నుంచును)

రాజు: - గౌతమా !

తరువునుండి చిదిమి తలిరాకుఁ గైసేసి
మరల నచట నుంచె చరణ మతివ
సరిగ మార్చికొనగ నిరువురీ గతిఁ గూడి
నడుమ మోసగింపఁ బడిన దేను. 53

వకు :- చెలీ ! ఇందు నీదోషము లేదు. నీ చరణసత్కారము నందియుఁ బూవలేదన్నచో నశోకము స్థాణువన్నమాట.

రాజు :-

మురువగు నందె గల్లురవిభ్రమోయ మదాలసలీలమై పదాం
బురుహమునన్ లతాంగి నిను ముట్టినయంత విభిన్నకోరకో
త్కర విచితాఖిలాంగమవు కా విది నా కగుచో నగున్ శిరః
పరిచిత మిట్టిదోహదము వమ్మొనరించితివే యశోకమా ! 54

గౌతమా ! మాట వెంబడిఁ బ్రవేశింతును.

విదూ :- రా, ఈమెను వెక్కిరింతును.

(ప్రవేశింతురు)

విపు :- అమ్మా చూడుడు. ప్రభువులటుపోవుచున్నారు.

ఇరా :- అనుకొనినట్లే జరిగినది.

విదూ :- (సమీపించి) బాగున్నది. ఈ యశోకమే వయస్యుఁడా యేమి ? ఇట్టి సత్కారమునకు.

ఉభ :- అమ్మో ప్రభువులు !

విదూ :- వకుళా ! తెలిసినదానవుగదా ! నీవైన యీ యకార్యమునుఁ గాదనవలదా ?

మాళ :- (భయపడును)

నిపు :- అమ్మో ! చూచితిరా ! గౌతముని దుండగము.

ఇరా :- వానిబ్రతుకే యిది.

వకు :- అయ్యో! ధారిణీదేవి యాజ్ఞయని చేసినది. ఇందులో నీమె యపరాధము లేదు. ప్రభువులు మన్నింపవలయును,

(తనతో మాళవికను ప్రణమిల్లఁ జేయును)

రాజు :- ఐనచో తప్పులేదు. లే. (మాళవికను చేయి పుచ్చికొని లేవఁదీయును)

విదూ :- దేవియన్నచో నెంత మన్నన !

రాజు :- (నవ్వి)

చెట్టుఁజూడ మిగుల బెట్టిదమ్మిది నీది
చిగురుటాకుపదను చిన్ని యడుగు
దీని దాఁకి కందెనో ! నొచ్చెనో ; దోహ
దావసరమునందు నబ్జవదన. 55

ఇరా :- అబ్బో ! ఏమి హృదయసౌకుమార్యము !

మాళ :- వకుళా ! పద. దేవికిఁ గృతకృత్యులమైతిమని విన్నవింతము.

వకు :- ప్రభువుల యనుమతిఁ గొనుము.

రాజు :- పోదువుగాని, నాదొకమాట.

వకు :- సావధానవై వినుము. ప్రభూ! సెలవీయుఁడు.

రాజు :- ఇందువదన! నేను నెన్నాళ్ళనోయుండి
యట్టె యెడద నలరువుట్టి యెఱుఁగ
వింపరాదె! దోహదంపు సద్విధివి స్ప
ర్శామృతమున నా కనన్య రుచికి. 56

ఇరా :- (తొందరగాఁ బ్రవేశించి) నింపుము. వింపుము. అశోక మయితే పూవలేదు కాని. యీయన మాత్రము నిలువున పూఁచితీరును.

(అందఱు నిరావతినిఁ జూచి తొట్రువడుదురు)

రాజు :- (జనాంతికము) ఇప్పుడు మార్గమేమి?

విదూ :- ఏమున్నది! పిక్కబలమే.

ఇరా :- వకుళావళికా! బాగున్నది. రాజుగారి మనోరథము నిప్పుడే ఫలింపఁజేయుము.

ఉభ :- దేవీ! కోపగింపకుము. ప్రభువుల ప్రణయమునకు మే మెవరము?

(నిష్క్రమింతురు)

ఇరా :- పురుషులు నమ్మదగినవారు కారు. బోయనిపాటకు లేడి వలె నే నీతనివెంటఁ బడితిని.

విదూ :- (జనాంతికము) ఏదో సమాధానమునుఁ జెప్పుము. కన్నములోఁ బట్టువడినను దొంగ తనకందు ప్రావీణ్యము కలదనియే చెప్పికొనవలయును.

రాజు :- మాళవికతో నా కేమిపని ? నిన్ను నిరీక్షించుచు నామెతో వినోదించుచున్నాను.

ఇరా :- ప్రభువు లిట్లు వినోదింతురని తెలిసినచో నింతప్రయాస పడియుండను.

విదూ :- పాపము ! దక్షిణుఁడైన రాజున కెంతకష్టము ! ఏదో మేమిటు వచ్చుచుండగాఁ ద్రోవలోఁ బాప మీమె కనుపడి నది. దేవియందలి బహుమానముచే రాజామెనుఁ బలుక రించెను. దానికింత యల్లరి!

ఇరా :- సరే, మీ ప్రసంగము కానిండు. ఆ బాధ నాకెందుకు ? (కోపముతో బయలుదేరును)

రాజు :- (అనుసరించుచు) చెలీ ! మన్నింపుము.

(ఇరావతి కాళ్ళకడ్డుపడిన మేఖలతోనే వెళ్ళుచుండును)

రాజు :- సుందరీ ! ప్రణయిజనము పయి నీ కీ యౌదాసీన్యము తగదు.

ఇరా :- తుంటరీ ! నిన్ను నమ్మరాదు.

రాజు :-

పరిచయాధికతను పలికెదు గాకేమి
శఠుఁడ నయిన నగుదు చండి ! పాద నీర
జాంతమందుఁ బేరెలుంగున వ్రాలి
యేడ్చె రశన కోప మింత విడవు. 67

ఇరా :- జారుచున్న యిదియును నీవలెనే యున్నది. (మొల నూలితోఁ గొట్టఁబోవును)

రాజు :- గౌతమా ! ఈ యిరావతి.

ప్రిదిలిన హేమకాంచి సవరింపక లోచనవారి ముంపుగా
మది సెగలైన రోసమున మత్ప్రణిపాత తిరస్క్రియా మిళన్
మదగతి నన్నదల్చి చనె మానిని కోలమెఱుంగుఁ బూంచి బె
ట్టిదముగ వింధ్యపర్వతతటిన్ బ్రహరించు నవాబ్దరేఖయై. 58

ఇరా :- ఇదియును నా దోషమేనా ?

రాజు :- (మొలనూలితోఁడి చేతినిఁ బట్టికొని) పొరపాటు. దండా ర్హుఁడను. నాయందలి కోపముచే నీవు మరింత రమ్య ముగానున్నావు. (పాదములపైఁ బడును)

ఇరా :- ని న్నలరిఁచుట కివి మాళవికాచరణములు గావు. (చేటితో నిష్క్రమించును)

విదూ :- ఇఁక లే ! నిన్నామె కరుణింపనేలేదు.

రాజు :- (లేచి) ఇరావతి వెళ్ళినదా ?

విదూ :- ఇప్పటి కీగయ్యాళి బారినుండి బయటపడితిమి. కుజుఁడు వక్రించినట్లామె తిరిగి రాకముందే పోదము.

రాజు :- ఆహా ! వలపెంత చెడ్డది !

తరుణి కొల్లఁగొనుట దలఁపెల్లఁ బ్రణిపాత
భంగ మిదియు మేలనంగఁ దలఁతు
నకట ప్రణయ మహిత యగు నిరావతి నుపే
క్షించి హృదయ మూరడిల్లు నెట్లు ? 59

(అందఱు నిష్క్రమింతురు)

తృ తీ యాం క ము

మాళవికాగ్నిమిత్రము

చతుర్థాంకము

(అనంతరము బెంగగొన్న రాజు, ప్రతీహారియును ప్రవేశింతురు)

రాజు :- (తనలో)

తొలినాళ్ళ వినుకలి నెలవై కరంచు న
మ్మదిరాక్షి దెస నాస మొదలుఁజేసి
పదపడి లోచన భాగ్యమై యొదవి ని
ల్చిన నాఁడు కూరిమి చివురువెట్టి
అలవోక నెలదోటఁ గలిసినవేళ న
చ్చెలువ వేపథు మృదు స్విన్నపాణి
సొలపిన నెమ్మేని పులకల తరచున
ముమ్మరమ్ముగఁ దాను మొగ్గదొడిగి

నాము హృదయసీమ పాదుగా నింతటి
ప్రోఁది గనిన వలపు పూవు విడిచి
తన్మనోజ్ఞ ఫల సుధా రసాస్వాదన
ననుఁ గృతార్థుఁ జేయ కునికి యెట్లు ? 60

(ప్రకాశము) గౌతమా !

ప్రతీ :- ప్రభూ ! గౌతముఁ డిచ్చట లేఁడు.

రాజు :- (తనలో) మాళవిక వార్త తెలిసికొమ్మని పంపితిని.

విదూ :- (ప్రవేశించి) వర్ధిల్లుము.

రాజు :- జయసేనా ! ధారణీదేవికిఁ గాలు బెణఁకినదఁట. ఎచ్చట నున్నదో తెలిసికొనిరమ్ము.

ప్రతీ :- చిత్తము (నిష్క్రమించును)

రాజు :- గౌతమా ! ఆమెవిషయ మేమైనది ?

విదూ :- పిల్లివాఁతబడిన గోరువంక బ్రతుకైనది.

రాజు :- (విచారముతో) ఎట్లు !

విదూ :- ఆ యమాయికురాలిని, ఆ యిరావతి గుహవంటి సార భాండ గృహాంతరమున బంధించినది.

రాజు :- నా ప్రసక్తివల్లనేనా !

విదూ :- కాక.

రాజు :- మనకింత విరోధులెవరు. దేవికిది ముట్టించుటకు.

విదూ :- పరివ్రాజిక చెప్పినదిది. ధారణీదేవినిఁ జూచి కుశల ప్రశ్నము చేసిపోవుటకు నిన్న నిరావతి వచ్చినదఁట !

రాజు :- వచ్చి !

విదూ :- ఆమె "ఆర్యపుత్రులనుఁ జూచితివా" అని యడిగిన దానికి "ప్రభువుల ప్రణయము పరిచారికలపై ప్రవహించుచున్నట్లు దేవి కీవరకుఁ దెలియదేమో !" అని వెళ్ళఁబోసికొన్నదఁట !

రాజు :- ఆహా ! ఈ ప్రసంగము మాళవిక మీఁదనే యనుమానమును గలిగించుచున్నది.

విదూ :- "అది యేమి ?" అని దేవి మూఁదలింపగా నీ ప్రణతి భంగమును మాత్రము విడిచి మిగిలిన దంతయునుఁ జెప్పిన దఁట:

రాజు :- ఇరావతి కెంత పగ ! సరే, తరువాత ?

విదూ :- ఏమున్నది ? నిగళితచరణలై వకుళయును మాళవికయును పాతాళవాసమునకుఁ బంపఁబడిరి.

రాజు :- అయ్యో !

వికసిత రసాల శాఖాగ్రవీథులందుఁ
గెరలుఁ దేఁటియుఁ గలవాణి పరభృతయును
ఆకట యెఱగోలుగాలి పెల్లగు నకాల
వృష్టిఁ జేరెనె కోటరవివరమునకు. 61

దీని కుపాయము లేదా !

విదూ :- ఎక్కడి యుపాయము ! సారభాండమునకుఁ గావలియగు మాధవికతో ధారణీదేవి నా యంగుళీయకమునుఁ జూడక వీరిని విడువరాదని యాదేశించెను.

రాజు :- (నిట్టూర్చి) గౌతమా ! ఇఁకఁ గర్తవ్యమేమి ?

విదూ :- (ఆలోచించి) మార్గము లేకపోలేదు.

రాజు :- అది యెట్టిది ?

విదూ :- (అటునిటుఁ జూచి) ఎవరైన విందురు. (చెవిలోఁ జెప్పును)

రాజు :- (హర్షముతో) పన్ని చూడుము.

ప్రతీ :- (ప్రవేశించి) ప్రభూ ! దేవి ప్రవాతశయ్యపై పరిజనము చందనానులేప మొనర్చి చరణసంవాహనము చేయుచుండఁ గౌశికీ ప్రసంగము నవధరింపుచున్నది.

రాజు :- మనము పోవచ్చును.

విదూ :- పోదము. రాజ్ఞీదర్శనమున కుపాయనముఁ గొనివత్తును.

రాజు :- (నెమ్మదిగా) జయసేనకు మనమాట చెప్పుము.

విదూ :- సరే. (జయసేన చెవిలోఁజెప్పి నిష్క్రమించును).

రాజు :- జయసేనా! ప్రవాతశయ్యకుఁ ద్రోవఁదీయుము.

జయ :- ఇటు యిటు.

(పూర్వోక్తముగా ధారణి ప్రవేశించును)

ధార :- బాగున్నది. తరువాత ?

పరి :- (పరికించి) అరుగో విదిశాధిపతులు! ఇంకొకసారి చెప్పుదును.

ధార :- ఆర్యపుత్రులే! (లేవఁబోవును)

రాజు :- సంభ్రమము వలదు.

నొచ్చియుండె మిగుల నూపుర విరహాను
చితము నీదు పద కుశేశయమ్ము.
ఉడుగ కీవు గడఁగి యుపచార సంభ్రమ
పరత నన్నునొంపఁ దెరగు కాదు. 62

ధార :- ఆర్యపుత్రులకు జయము.

పరి :- ప్రభువులకు విజయము.

రాజు : (పరివ్రాజికకు నమస్కరించి కూర్చుండి దేవితో) బాధ యెట్లున్నది ?

ధార :- కొంచెము నయమే.

(జందెమును బొటనవ్రేలికిఁ జుట్టుకొని తొట్రుపాటుతో గౌతముడు ప్రవేశించును).

విదూ :- అమ్మో! అమ్మో! పాము కరచింది. (అందఱు విచారింతురు)

రాజు :- అయ్యో ! ఉన్నచోట నుండవు.

విదూ :- దేవీ సందర్శనోపాయనమునకై తోటకుఁ బోయితిని.

ధార :- అయ్యో ! నాకౌఱకా !

విదూ :- అశోక స్తబకము నందుకొనఁబోగా తొఱ్ఱ వెలువడి పాము కరచింది; కాట్లివిగో !

పరి :- కాటునకు ఖండనమే ప్రతిక్రియ ! అది చేయింపుడు.

ఛేదో దంశస్య దాహోవా క్షతేర్వా రక్తమోక్షణమ్
ఏతాని దష్టమాత్రాణాం మాయుష్యాః ప్రతిపత్తయః. 63

రాజు :- ఇప్పుడు విషవైద్యు అవసరము. జయసేనా ! నీవేగి వెంటనే ధ్రువసిద్ధిని దోడ్కొని రమ్ము.

ప్రతీ :- చిత్తము. (నిష్క్రమించును)

విదూ :- అయ్యో ! అకాలమృత్యువు.

రాజు :- భయపడకుము ; విషములేని కాటేమో !

విదూ :- భయమేమిటి, నా యొడలు సిమసిమలాడిపోవుచున్నది. అమ్మో.

ధార :- అయ్యో ! బ్రాహ్మణుఁ డాఁగలేకపోవుచున్నాఁడు. పట్టికొనుడు.

పరి :- (సంభ్రమముతోఁ బట్టికొనును)

విదూ :- రాజా ! బాల్యమునుండి మీ కాప్తుఁడను. పుత్రహీనయగు నా తల్లి యోగక్షేమమును విచారింపుము.

రాజు :- భయములేదు. ధైర్యముగా నుండుము. ఇప్పుడే ధ్రువసిద్ధి వచ్చును.

ప్రతీ :- (ప్రవేశించి) ఆ గౌతము నిచ్చటికే పంపవలసిన దని ధ్రువసిద్ధి విన్నవించుచున్నాఁడు.

రాజు :- ఈతని-జాగ్రతగా నచ్చటికిఁ జేర్పుము.

విదూ :- (ధారణినిఁ జూచి) బ్రదుకుదునో లేదో ! ప్రభువులను సేవించుటకుగా నీ కపరాధములనుఁ జేసితిని. క్షమింపుము.

ధార :- దీర్ఘాయువ వగుము. (గౌతముఁడు ప్రతీహారియు నిష్క్ర-మింతురు.)

రాజు :- పాపము ! బెదురుగుండెవాఁడు ! సార్ధకనాముఁడగు ధ్రువసిద్ధి యందుఁ గూడ నీతనికి నమ్మకము కుదురుట లేదు.

ప్రతీ :- (ప్రవేశించి) ప్రభూ ! ఉదకుంభ విధానమున సర్పముద్ర కల్పింప వలసియున్నదని ధ్రువసిద్ధి విన్నవించుచున్నాఁడు.

ధార :- ఇదిగో సర్పముద్రితమగు నుంగరము ! పనియైన వెంటనే నాచేతి కిమ్ము. (ఉంగరము నిచ్చును; ప్రతీహారి తీసి కొనును)

రాజు :- జయసేనా ! ప్రమాదము తప్పినట్లు వెంటనే వచ్చి చెప్పుము.

ప్రతీ :- చిత్తము. (నిష్క్రమించును)

పరి :- గౌతమున కపాయము లేదని నాకుఁ దోఁచుచున్నది.

రాజు :- అట్లే యగుగాక. (ప్రతీహారి ప్రవేశించి)

ప్రతీ :- క్షణములో గౌతముఁ డోషధీ ప్రభావమున నపాయ విముక్తుఁడైనాఁడు.

ధార :- అమ్మయ్య ! అప్రతిష్ఠ తప్పినది.

ప్రతీ :- మరి యమాత్యవాహతకులు, ఆలోచించవలసిన రాజ కార్యము చాల మిగిలియున్నది. ఒకసారి దర్శన మిప్పింపు డని వేడుచున్నారు.

ధార :- ఆర్యపుత్రులు రాజకార్యములనుఁ జూచిరండు.

రాజు :- ఈ ప్రదేశమునకు నెండవచ్చినది. ఈ వ్యాధికి శైత్యోప చారము ప్రశస్తము, సెజ్జను నీడకుఁ బట్టుడు.

ధార :- (పరిజనముతో) ఆర్యపుత్రవచనము ననుష్ఠింపుడు.

పరి :- చిత్తము. (పరిజనముతో దేవి నిష్క్రమించును)

రాజు :- జయసేనా ! రహస్యద్వారమున నన్ను ప్రమదవనము నకుఁ జేర్పుము.

ప్రతీ :- ఇటు యిటు.

రాజు :- జయసేనా ! గౌతముని మనోరథము సిద్ధించినట్లేనా ?

ప్రతీ :- కాకేమి ?

రాజు :-

అభిమతార్థసిద్ధి కమరు ప్రయోగమ్ము
నియత సాధ్య మనెడి నిశ్చయమ్ము
నందియును మనమ్ము సందేహభాజియై,
కమలనయనఁ దలఁచి కళవళించు. 64

విదూ :- (ప్రవేశించి) నీ పుణ్యములు పండినవి.

రాజు :- జయసేనా ! నీపని చూచికొనుము.

జయ :- చిత్తము. (నిష్క్రమించును)

రాజు :- గౌతమా ! మాధవిక యెంత యమాయికురాలు ; దానికి సందేహమే కలుగలేదా ?

విదూ :- సందేహమేమి ! ఆ యుంగరమునుఁ జూచిన తరువాత.

రాజు :- ఉంగరము మాట సరే. 'వీరిరువురితో నేమిపని ? నీవే రానేల ?' అని యడుగవలసినది.

విదూ :- అడిగినది. మందమతి నైన నాకును దెలివి పుట్టుకొని వచ్చినది.

రాజు :- చెప్పుము.

విదూ :- ప్రభువులకుఁ దారాబలము సరిలేమి బంధితుల నెల్ల విడువవలసినదని కార్తాంతికు లుపదేశించిరంటిని.

రాజు :- (హర్షముతో) ఆతరువాత !

విదూ :- దేవియే స్వయముగా నిటకు రానెంచినది. కాని యింతలో నిరావతి స్మృతికి రాగా నన్ను పంపినదంటిని. నమ్మి వీరి నది విడిచిపుచ్చినది.

రాజు :- నా మీఁద నీకెంత ప్రేమ !

తలపోయ నర్థజాతము
లలవడు టదియెల్ల చెలుల యతుల్య మనీషా
బలముననె కాదు నెయ్యపుఁ
గలిమియు నౌనఁగూడి కార్యకారి యొకయెడన్. 65

విదూ :- నీవు త్వరగా రావలయును. సముద్ర గృహమున వకుళతో నామె నుంచి నీ కోసము వచ్చితిని.

రాజు :- నేనే యామెను పలుకరింతును. పద.

విదూ :- రా. (పరిక్రమించి) ఇదిగో సముద్రగృహము.

రాజు :- (సందేహించి) గౌతమా ! ఇరావతి పరిచారిక చంద్రిక యదిగో! పూవులు కోయుచున్నది. ఇటు వచ్చునేమో! మనమీ మదురుచాటున నుందము.

విదూ :- ఔను. చోరులకును, కాముకులకును చంద్రిక సరి పడనిది.

(యథోక్త మొనరింతురు)

రాజు :- గౌతమా ! ఆమె నన్ను ప్రతీక్షించునా ! ఈ గవాక్షము దగ్గఱ నిలచి ప్రతీక్షింతును.

విదూ :- సరే. (ఇరువురును చూచుచుందురు)

(యథోక్తముగా వకుళయును మాళవికయునుఁ బ్రవేశింతురు)

వకు :- నెచ్చెలీ ! భట్టారకునకుఁ బ్రణమిల్లుము.

మాళ :- (నమస్కరించును)

రాజు :- నా ప్రతికృతికిఁ గాఁబోలును.

మాళ :- (హర్షముతో ద్వారమువంకఁ జూచి) వకుళా ! నన్ను విప్రలబ్ధనుఁ జేయుచుంటివా !

రాజు :- ఈమె యాశాభంగము నా కౌతుకమును రెట్టించుచున్నది.

అగు నుషః కందళిత చారు హాసమునకుఁ
జరమ సంధ్యా నిమీలిత చ్ఛాయమునకు
జలజమునకు సకృన్నిమేషానుకారి
మోద ఖేదానులబ్ధి నిమ్మగుద మోము. 65

వకు :- నేనన్నది చిత్తరువు నుద్దేశించి.

ఉభ :- (నమస్కరించి) ప్రభువులకు జయము.

మాళ :- వకుళా! నాఁడేమో క్షణమాత్ర దర్శనుఁడగుటచేఁ గాబోలు నా కనువేదు రనుకొంటిని. కాని నేటికినిఁ దనివి తీరుటలేదు.

విదూ :- వింటివా ! చిత్తరువులోవలె లేవట. మంజూష కాభరణ భారమువలె నీకిఁక రూపగర్వము కేవల విడంబనము సుమా !

రాజు :- స కౌతుక మైనను స్త్రీజనము స్వభావముచే లజ్జాలసము,
మది నాలోకన కౌతుకమ్ము కెరలింపన్, గాంతు నెమ్మేని యొ
ప్పిద మానం బ్రథమోపయానమున నుద్వేగమ్ము పెల్లయ్యెఁ జా
లదు ప్రాణేశుల యం దొకింత మదలీలావృత్తికిన్ సిగ్గుముం
పు, దళమ్మై కనుదోయి త్రొక్కటపడున్ ముగ్ధేక్షణాశ్రేణికిన్.

మాళ :- ఎవరామె ? ప్రభువు లామెవంక నటు చూచుచున్నారు ?

వకు :- ఆమె యిరావతి.

మాళ :- ప్రభువు చాల ననుకూలుఁడు, కానిచో నామె వంకనే యటు పరికింపఁడు.

వకు :- (తనలో) పాపము ప్రతికృతినిఁ జూచి నిజమనుకొని కలఁతఁ బడుచున్నది. ఈమె నుడికింతును, (ప్రకాశము) ప్రభున కీమె వాల్లభ్యభూమి.

మాళ :- అయినచో నాకీ ప్రయాసమేల ? (అని మొగ మావలకుఁ ద్రిప్పుకొనును)

రాజు :- గౌతమా !

పటు పల ద్రూలతా భంగమ్ము వలనఁ
జిటిలిన నునుబొట్టు సిరులు పెచెత్త

స్ఫురితోష్ఠ పల్లవ పుటముగా నావలకుఁ
దరలింప నెమ్మోము తరుణి సాసూయముగ
నాథాపరాధ మానముల నేర్చిన దైన
క్రోధాభినయ విద్య కొనసాగె పియెడల. 67

విదూ :- ఆమెనుఁ దేర్చికొనుము.

మాళ :- ఆర్యగౌతముఁడు కూడ నిచ్చటనే యున్నాఁడు. (వేఱొక వంకకు మరలును)

వకు :- (మాళవిక నాపి) కోపము వచ్చినదా ?

మాళ :- ఇంతవరకుఁ గోపించితి ననియే యనుకొను చుంటివా! ఐనచో నిఁకఁ గోపగింతును.

రాజు :- (సమీపించి)

చిత్ర సన్నివిష్ట చేష్టనుఁ బాటించి
కనలనేల! మనసు గందనేల!
నీదు దయ కనన్యసాధారణమ్మగు
దాసభావ మేనుఁ దాల్చి యుంటి. 68

వకు :- ప్రభూ ! విజయము,

మాళ :- (తనలో) ఏమి యీ భ్రాంతి ? (సానునయముగా దోయిలించును)

విదూ :- ప్రభూ ! ఉదాసీనులా యేమి ?

రాజు :- ఈమె యవిశ్వసనీయతనుఁ బట్టి.

విదూ :- ఆమెయందు మీకీ యవిశ్వాసమేల ?

రాజు :- వినుము. స్వప్నములలో

మెలఁత మల్లోచ నాళిందముల నొకొక్క
వేళ మెఱసి తటిల్లతా లీల దరలు
నంది యొకపరి మద్బాహుబంధమున మె
లంగి నంతటి లోన జుణింగిపోవు. 69

వకు :- నీ వనేక పర్యాయములు ప్రభువులను వంచించితివఁట ! నీవే వారికి నమ్మకమును కలిగించుకొనవలయును.

మాళ :- నాకు మాత్రము స్వప్నసమాగమముఁ గూడ దుర్లభమైనది.

వకు :- ప్రభూ ! దీనికి సమాధానమేమి ?

రాజు :- ఉత్తరమ్ములు వేవేల నువిద నీదు
సకియకును పంచబాణాగ్ని సాక్షికముగ
నర్పితమ్మయ్యె సుమ్ము నా యాత్మ నేఁడు
సేవనీయ మేకాంత సంస్థితి యొకండె. 70

వకు :- అనుగ్రహింపఁ బడితిని.

విదూ :- వకుళా ! ఆ లేడి లేఁత యశోకపు చివుళ్లనుఁ ద్రుంచుచున్నది. మరలింతము రా.

వకు :- పోదము. (బయలుదేరును)

రాజు :- గౌతమా ! కనిపెట్టియుండుము.

విదూ :- నాకా ! ఈ హెచ్చరిక.

వకు :- అయ్యో ! నేనీ చాటున నుందును; నీవీ ద్వారమును పాలింపుము.

విదూ :- సరే. (వకుళ నిష్క్రమించును)

విదూ :- నేనీ చలువ ఱాతికంబమున కానుకొందును. (అనుకొని) ఎంత చల్లగా నున్నది ! (నిద్రించును)

(మాళవిక ముడుచుకొని కూర్చుండును)

రాజు :- ఎటఁద విడనాఁడు సాధ్వసమ్మింత యెన్ని
నాళ్ళనో యుండి రాగసనాథ మూర్తి
నేను సహకార తరుభావ మూను వేళ.
నతివ! యతిముక్తవల్లి వీ వగుట పోలు. 71

మాళ :- ఆమె బెదురు వల్ల నాత్మసుఖమునుగూడ విడనాడితిని.

రాజు :- భయములేదు.

మాళ :- మీధైర్యము నాకుఁ గ్రొత్తకాదు. ఇరావతీ సన్నిధిని జూచితినిగదా !

రాజు :- నాయకులకు దాక్షిణ్యం
చేయడలను నపరిహార్య మిట్లగుటను నాఁ
డాయె నటు నాదు నసువుల
నో యంబుజవదన! విలిపియుంటివి నీకై. 72

చిరకాలముగా నిరీక్షించుచున్న నన్ను దయచూడుము. (చేతులు సాచును. మాళవిక సాభినయముగా వారించును)

రాజు :- (తనలో) నవాంగనల యందు కామోదయదశావిర్భావము హృదయంగమము.

మించఁ గేలూఁది వారించుఁ గాంచీపద
వ్యాసంగ వేళల నంగుళులను
విరచించుఁ గరయుగా వరణమ్ము కుచపాళి
నరభసాశ్లేష ప్రసంగములను

వాలారుఁ గనుదోయి సోలు సోయగ మూన
మోమెత్త నడ్డమ్ముగా మలంచు
ప్రతిపదాపాదిత ప్రతిబంధము లివెల్లఁ
గౌతుకారంభ రంగమ్ము లయ్యె
నలవరింప నాకు నభిలాష పరిపూర్తి
వివియు నొక్క తెరువులేమొ యనఁగ
నువిద ముగ్ధభావ మొకటి యన్నింటికి
మిగిలి నా యెడంద సొగయఁ జేయు. 73

(ఇరావతియు నిపుణికయుఁ బ్రవేశింతురు)

ఇరా :- నిపుణికా ! సముద్రగృహము వాకిట గౌతముఁడొంటరిగా నిద్రించుచున్నాఁడని చంద్రిక చెప్పిన మాట నిజమేనా ?

నిపు :- కానిచో మీకేల నివేదింతును ?

ఇరా :- అక్కడికే పోయి పలుకరించి వత్తము, పాపము గండము గడచి బయటపడినాఁడు.

నిపు :- ఏమో చెప్పఁదలఁచినట్లున్నది.

ఇరా :- ఏమియును లేదు. చిత్రగతులైన యార్యపుత్రులనుఁ బ్రసన్నులనుఁ జేసికొనుటకు.

నిపు :- భర్త ననుయించుట యెట్లు ?

ఇరా :- పటములో నెంతో యథార్థముగను నంతే, మర్యాదోల్లంఘనము కూడదుగాన నీ యారంభము.

నిపు :- ఇటు యిటు. (పరిక్రమింతురు)

చేటి :- (ప్రవేశించి) భట్టినికి జయము. దేవి చెప్పుచున్నది. "మాత్సర్యమున కిది వేళగాదు. నీ గౌరవమునుఁ జూచి

వకుళావళికతోఁ బాటు మాళవికకు సంకెలలువేయించితిని. ఇప్పు డార్యపుత్రుల యభీష్టానుసారము చేయుటకు నీ వనుమతింతువేని యట్లు చేసెదను. నీ యుద్దేశ్యమును చెప్పవలయును.

ఇరా :- నాగరికా ! దేవి కిట్లు విన్నవింపుము. "మహారాజ్ఞిని నియోగించుటకు మే మెవరము ? వారిని శిక్షించి మీ యనుగ్రహమును ప్రకటించితిరి. మా కేడుగడ మీ దయా విశేషమేకదా !"

చేటి :- చిత్తము. (నిష్క్రమించును)

నిపు :- (పరిక్రమించి చూచి) ఇదిగో గౌతముఁడు సముద్ర గృహమువాకిట నంగడిలోని యాఁబోతువలెఁ గూర్చుండియే కునికిపాట్లు పడుచున్నాఁడు.

ఇరా :- విషపుసొక్కు సాంతము పోలేదేమో ?

నిపు :- మొగము కవళికలో దోషము లేదు. ధ్రువసిద్ధి యంతవాఁడు చికిత్సచేసినప్పుడు సందేహమునకుఁ దావులేదు.

విదూ :- అమ్మా, మాళవికా ! (కలవరించును)

నిపు :- వింటివా ! వీనిని నమ్ముట యెట్లు ? ఇప్పటివరకు నుంద్రాళ్ళు మెక్కి మాళవిక కొఱకుఁ గలవరించుచున్నాఁడు.

విదూ :- ఇరావతికన్న గొప్పదానవగుము.

నిపు :- ఇదియా ప్రమాదము ! ఈ బ్రాహ్మణునకుఁ బాము లన్నచో భయము. స్తంభముచాటున నుండి మెలికలు తిరిగిన యీ కఱ్ఱతో వెఱపింతును.

ఇరా :- ఈ కృతఘ్నున కాపాటు రాఁ దగినదే.

(నిపుణిక విదూషకునిపై గఱ్ఱను జార విడుచును)

విదూ :- (ఉలికిపడి లేచి) అమ్మో ! అమ్మో ! నామీఁద పాము పడింది.

రాజు :- (వెంటనేవచ్చి) భయములేదు. భయములేదు.

మాళ :- (వెంటవచ్చి) పామఁట ! తొందరవలదు.

ఇరా :- ఆ, ఆ, ఆర్యపుత్రు లిచ్చటనే యున్నారే !

విదూ :- (నవ్వి) ఏమిటి ? ఇదా ! 'నేననుకున్నాను గదా! మొగలి ముళ్ళతో గీసికొని పాముమీద నపవాదు వేసినందు కిలా సంప్రాప్త మయిన'దని.

వకు :- (పటాక్షేపముతో వచ్చి) రావలదు. ప్రభువులు రావలదు. మెలికలుగా నిది యేదో పామువలె నున్నది.

ఇరా :- (స్తంభము చాటునుండివచ్చి రాజుతో) దంపతుల దివా సంకేతము నిరాటంకముగా జరిగినదా ?

రాజు :- ఇదియేమి పరామర్శ !

ఇరా :- అభిసార దూత్యమునందు నీ ప్రతిజ్ఞ నెరవేరినదే వకుళా వళికా !

వకు :- చాలులెండు. కప్పకూతకు వెరచి పర్జన్యుఁడు వర్షించుట మానుకొనునా !

విదూ :- ఇది మర్యాద కాదు. నిన్ను చూచినవెంటనే నాటి యవమానము నీయన మఱచియే పోయెను. నీకు మాత్ర మిప్పటికి ననుగ్రహము కలుగలేదు.

ఇరా :- కోపమువచ్చి యేమి చేయఁగలను ?

రాజు :- అవునుగాని నీ కీ యకారణ కోపము తగదు.

కారణము లేకయునుఁ గో
పారంభమ్మునకుఁ బాత్ర మయ్యెనె ! నీమో
మౌ, రేయి పర్వభిన్న
మ్మై, రాహుగ్రస్త చంద్ర మగుటది కలదే ! 74

ఇరా :- అకారణ మన్నమాట మంచిదే. మా సంపదలనుఁ గొల్లగొట్టి యొరులకుఁ జేర్చుచున్నపుడు కోపగించితిననియా, నా కీ నగుబాటు !

రాజు :- పొరపడుచున్నావు. నాకు నిజముగనే కారణము కనుపించుట లేదు. ఇది యుత్సవవేళ కదాయని యందఱితోఁ బాటు వీరిని విడిచితిని. కృతజ్ఞతకయి వీరు నన్నుఁ జూడ వచ్చిరి.

ఇరా :- నిపుణికా ! పోయి ధారణీదేవితో నీ పక్షపాతము బయల్పడినదని చెప్పుము.

నిపు :- చిత్తము. (నిష్క్రమించును)

విదూ :- (తనలో) కొంప మునిఁగినది. పంజరమునుండి జారిన పావురాయి పిల్లికంటఁ బడినది.

నిపు :- (ప్రవేశించి, జనాంతికము) మాధవిక కనుపించి చెప్పినది. జరిగిన కథ యిదట! (చెవిలోఁ జెప్పును.)

ఇరా :- (తనలో) ఈ బ్రాహ్మణుని తంత్రమే యిది. (విదూషకునిఁ జూచి) ఇది కామనీతి.

విదూ :- నీతియే ! అది యేమాత్ర మబ్బినను నికృష్టమగు రాజసేవ చేసియుండక పోదును.

రాజు :- దీనినుండి బయటపడుట యెట్లు ?

(ప్రవేశించి)

ప్రతీ -- ప్రభూ ! బంతివెంట పరువెత్తుచున్న వసులక్ష్మిని కోతి భయపెట్టినది. ఇపుడామె రాణియొడిలో నుండి పెనుగాలికిఁ జివురాకువోలె వణఁకి పోవుచున్నది. ఇంకనుఁ దెలివి రాలేదు.

రాజు :- అయ్యో ! పసితనము !

ఇరా :- (ఆవేగముతో) త్వరగా పదండి. ఆమె మరింత బెదరక ముందే తేర్పవలయును.

రాజు :- నేనువచ్చి తేర్చెదను. (తొందరగాఁ బరిక్రమించును)

విదూ :- బలే ! కోతి ! గండము తప్పించినది. (రాజు చేటి యిరావతి, నిపుణిక నిష్క్రమింతురు.)

మాళ :- వకుళా ! ధారణీదేవినిఁ దలంచినచో నాగుండె కొట్టుకొనుచున్నది. ఇంతకుమించి యేమి రానైయున్నదో !

(నేపథ్యమున)

ఆశ్చర్యము ! ఆశ్చర్యము ! దోహదమొనరించి యైదు రాత్రులు ముగియకముందే రక్తాశోకము నిలువున మొగ్గఁ దొడిగినది.

ఇరు :- (విని సంతోషింతురు)

వకు :- మాళవికా ! యోదారుము. దేవి యాడినమాట తప్పదు.

మాళ :- పోయి యుద్యానపాలికవెంట నుందును.

వకు :- మంచిది! (నిష్క్రమింతురు)

చతుర్థాంకము

మాళవికాగ్నిమిత్రము

పంచమాంకము

(ఉద్యానపాలిక ప్రవేశించుచున్నది)

మధు :- ఈ రక్తాశోకారాధనమునకుఁ జక్కని యరుగు కట్టి తిని. పోయి యీ మాట దేవికి నివేదింతును. (పరిక్ర మించి) పాపము ! మాళవికను జూచినచో జాలి వేయు చున్నది. ఆమెపై నంత కనలిన ధారణీదేవి యీ వార్త విని యెంత ముచ్చటపడునో ! (చూచి) రాజముద్రాంకిత మగు పెట్టెతో నాబవంతి నుండి వచ్చున దెవరో; అవును సారసికుఁడే. దేవికడనుండి కాఁబోలు. (పెట్టెతో సార సికుఁడు వచ్చును) సారసికా ! ఎచ్చటికి ?

సార :- పండితుల కీయవలసిన నెలసరి దక్షిణలను పురోహితు నకుఁ జేర్చుచున్నాను.

మధు :- దక్షిణ లేమిటి ?

సార :- యజ్ఞాశ్వ రక్షణకై భర్తృదారకుఁడు వసుమిత్రుఁడు వెడలిన నాఁటినుండి యాతని యాయుర్వృద్ధికై ధారణీ దేవి బ్రాహ్మణులకు దక్షిణ లిప్పించుచున్నది.

మధు :- ఆమె యెచ్చట ?

సార :- మంగళగృహములో. విదర్భదేశమునుండి తమ్ముఁడు వీర సేనుఁడు వ్రాసిన యుత్తరమును వినుచున్నది.

మధు :- మరల విదర్భరాజేమిటి ?

సార :- వీరసేన ప్రముఖులు మన సేనాపతులు విదర్భరాజును స్వాధీనము చేసికొనిరఁట. ఆతని జ్ఞాతి మాధవసేనుఁడు విడువఁబడెను. ప్రస్తుతము మహారత్నములును వాహనములును శిల్పకారికా బహుళమగు పరిజనమును కానుకలిచ్చి విదర్భరాజిచటికి దూతనంపెను!

మధు :- పస. నీపని చూచుకొనుము. నేను దేవినిఁ జూడఁబోదును. (అని నిష్క్రమింతురు.) ఇది ప్రవేశకము.

(ప్రతీహారి ప్రవేశించును)

ప్రతీ :- చిరకాలమునకుఁ బూఁచిన యశోకమునకు ధారణీదేవి యుత్సవము చేయనెంచి, దాని ప్రసూనవైభవము నవలోకించుటకుఁ ప్రభువులను పిలిచిరమ్మన్నది. వారు ధర్మాసనమునుండి లేచువేళ కావచ్చినది. (పరిక్రమించును)

(నేపథ్యమున వైతాళికులు)

జయము జయ మేలినవారికి, దేవర దండనీతికి శత్రువు లౌదల లొగ్గుచున్నారు.

ప్రథ :-

కల పుంస్కోకిల నాదసక్తి విదిశా కల్లోలినీ తీర భూ
ములలో మన్మథుపోల్కి నామని నహమ్మేల్ సీకిటన్ సాఁగు, నా
వల సేనా జయహస్తి భగ్న వరదా ప్రాంతావనీరుట్ప్రహో
చ్ఛలితుండై ధరఁజాఁగెవీయహితుఁడున్ సమ్రాట్త్వ తేజోఽవధీ!

ద్వితీ :-

వీరప్రీతి విదర్భసంశ్రయ కథావిష్కారవేశన్ సుధీ
వారమ్ముల్ కవితాను గుంఫనములన్ వర్ణింతు రీ నేఁటి పీ
యారంభమ్మును నాఁటి నంద తనయ ప్రారంభమున్ రాజ్య ల
క్ష్మీ రుక్మిణ్య పహార పద్ధతి జనశ్రేణీ కృతాశ్చర్యమున్. 76

ప్రతీ :- అదిగో జయశబ్దము. ప్రభువు లిటే వచ్చుచున్నారు. వారిదృష్టి కోసరిల్లి యీ స్తంభముప్రక్క నుందును. (విడిగా నిలుచును)

(వయస్యునితో ప్రభువు వచ్చును)

ఒక్క దెస నేర్పఁ గాంతా వియోగవహ్ని
హృదయ మలరింప నొకదెస రిపుజయమ్ము
మెండుకొను సోనవానల కెండపొడకు
మీల దుస్మీల దబ్జమ్మువోలె నయ్యె. 77

విదూ :- నీ మనోరథము ఫలింపఁ గలదని నాకుఁ దోఁచుచున్నది.

రాజు :- ఎట్లు ?

విదూ :- పరివ్రాజికతో దేవి చెప్పినదఁట "నీనేర్పు తుది మేరగా మాళవికకు వివాహాలంకరణ మొనరింప వలసినద" ని. ఆమె ప్రయత్నపడి మాళవిక నలంకరించినది. ఇది యంతయునుఁ జూడగా దేవి నీ మనోరథమును దీర్పఁ గలదని నాకుఁ దోఁచుచున్నది.

రాజు :- మా యెడల నామె పూర్వవర్తనములను బోల్చికొనినచో నట్లే యనిపించుచున్నది.

ప్రతీ :- (ప్రవేశించి) దేవరకు జయము. అశోకోత్సవ దర్శనమునకు మీ రాకను దేవి వేఁచి యున్నది.

రాజు :- ఆమె యచటనే యున్నదా ?

ప్రతీ :- ఔను. పరిజనమునకు యథోచితముగాఁ బారితోషికము లిచ్చి పంపి మాళవిక మున్నగు నాత్మపరిజనముతోఁ బ్రభువులనుఁ బ్రతీక్షించుచున్నది.

రాజు :- (హర్షముతో విదూషకునిఁ జూచి జయసేనతో) ముందు పద.

ప్రతీ :- ప్రభూ! దయచేయుఁడు,

విదూ :- ప్రభూ! ఆమని పరువ మించుక ప్రాలినట్లున్నది.

రాజు :- నీవన్నట్లే

ముందటఁ గనుఁగొన వగరుం
బిందెలఁ గాయలను నలరు పెంపెడలిన మా
కందములను గురవక వన
మంద సుమము లోసరిల్లె మధువని చూడన్. 78

విదూ :- (పరిక్రమించి) ఓహో! పూలగుత్తు లతికించినట్లు ఆ యశోక మిదియే. అవలోకింపుము.

రాజు :- అప్పుడు పూవు విడువమికిని, అపురూప మగు నిప్పటి యీ పూఁతకును సరిపోయినది. చూడుము.

ప్రథమత స్సూచిత వసంత వైభవమ్ము
లుపవనాశోకలత లెల్ల నొక్క మొగిని
రచిత దోహద మీ తరురాజు మేనఁ
దమ ప్రసూన సంపదలెల్లఁ దాల్పఁజేసె. 79

విదూ :- ప్రభూ ! సందేహము వలదు. మనము చేరువయగు చున్నను మాళవిక యిచట నుండుటకు దేవి యనుమతించు చున్నది.

రాజు :- (హర్షముతో) గౌతమా ! అరుగో.

వ న్నెదుర్కొనె దేవి మనః ప్రియతమ
వినయమునఁ దోడలేచి వెన్వెనుక కొదుగ
పిత కమలహస్త రాజ్యలక్ష్మి సరస నరు
దేర నేతెంచు వసుమతీదేవి వోలె. 80

(ధారణియును, మాళవికయును, పరివ్రాజికయును, పరిజనమును ప్రవేశింతురు)

మాళ :- (తనలో) ఈ వైవాహికాలంకరణమునకుఁ గారణము నెఱుంగుదును. కాని కమలినీపత్ర గతజల బిందువువలె నాహృదయము కంపించుచున్నది. ఊరక నెడమకన్ను కూడ నదురుచున్నది.

విదూ :- ప్రభూ ! వైవాహికాలంకరణముతో నీమె యందము మరింత కొట్టవచ్చినట్లున్నది.

రాజు :- ఔను.

ఆ నతి స్రంపి దుకూల పల్లవ మహార్ఘానేక భూషాలస
త్తనువల్లీ సుషమాభిరామయగు నీతన్వీలలామమ్ము చై
త్ర విశాలీల హిమాత్యయాతి విశదానంతోడు మాలా వినూ
తన చంద్రాతపవేష్టితాకృతి యనం దానెంతయున్ బొల్చెడిన్,

ధార :- (సమీపించి) ఆర్యపుత్రులకు జయము.

విదూ :- వర్ధిల్లుము.

పరి :- ప్రభూ ! విజయము.

రాజు :- అమ్మా ! అభివాదనము.

పరి :- అభీష్టావాప్తి రస్తు.

ధార :- (స్మితముతో) నేటినుండి యీయశోకమునుఁ దరుణీ సహాయుఁడగు నార్యపుత్రులకు సంకేత గృహముగా నేర్పరచితిమి.

విదూ :- ఎట్టి సన్మానము !

రాజు :-(సిగ్గుతో నశోకమునుఁ బ్రదక్షిణింపుచు)

తెగడి మధుమాస లక్ష్మి విదేశ సరణిఁ
దాల్చె నీయానతిని లతాంతాపదేశ
మున శిరోవీధి నే తరుమూర్తి యతని
కరుదు గావిట్టి సత్క్రియ లబ్జవదన ! 82

విదూ :- ప్రభూ ! ప్రాయపుఁ జెలువమునుఁ దిలకింపుము.

ధార :- ఏమిటి ?

విదూ :- అశోకసంపద !

(అందఱును గూర్చుండిరి)

రాజు :- (మాళవికనుఁజూచి తనలో) దగ్గఱయైనకొలఁది విరహాను భవము కష్టతరము.

కమలపత్ర మాత్రాంతరితము రథాంగ
మిథున రాగపథ మ్మాక్రమించి విఱచు
యామినియుఁ బోలె మత్ప్రణ యానుషంగ
మున ననుజ్ఞాసహిత దేవి పొలిచె నెదుట. 83

కంచు :- (ప్రవేశించి) దేవా! జయము. విదర్భదేశమునుండి వచ్చిన యుపదలలో మార్గశ్రాంతలగు నిరువురు శిల్పకారికల కింతకుమున్ను దర్శనము లభింపలేదు. ఇపుడు వారు వేఁచియున్నారు.

రాజు :- ప్రవేశపెట్టుము.

కంచు :- చిత్తము, (నిష్క్రమించి వారితోఁ బ్రవేశించును.)

ప్రథ :- (జనాంతికముగా) మదనికా! ఈ రాచనగరులోఁ దిరుగుచున్నపుడు నా హృదయము నలముకొనుచున్న యీ ప్రశాంతి యేమి!

మద :- జ్యోత్స్నికా! రాఁ గల సుఖదుఃఖములను మనస్థితి సూచించునందురు.

జ్యోత్స్న :- ఇపుడది ధ్రువ పడవలయును.

కంచు :- అరుగో రాజదంపతులు.

(ఇరువురును సమీపింతురు. మాళవికయును పరివ్రాజికయు నొకరి నొకరు చూచికొందురు)

ఇరు :- రాజదంపతులకు జయము.

(రాజానుమతిచే నిరువురునుఁ గూర్చుందురు)

రాజు :- మీరు నేర్చిన విద్యయేమి?

ఇరు :- మాకు గాంధర్వమునఁ బ్రవేశము కలదు.

రాజు :- దేవీ! వీరిలో నొకరిని పరిగ్రహింపుము.

ధార :- మాళవికా! నీకెవరు సహకరింతురు?

ఇరు :- (మాళవికనుఁ జూచి) అమ్మో! ఆమెయే.

(కంట నీరుపెట్టికొనుచు నమస్కరింతురు. అందఱు నచ్చెరువడి చూచెదరు)

రాజు :- ఆమె యెవరు! మీరెవరు?

ఇరు :- ఈమెయే మా భర్తృదారిక.

రాజు :- ఎట్లు?

ఇరు :- ప్రభువులు విదర్భనాథుని వశపరచికొని విడిపించిన మాధవసేనుని చెల్లెలు. ఈమె మాళవిక.

ధార :- ఎట్లు? ఈమె రాజనందనయా! మంచిగంధపుఁ జెక్కను పాదుకల కుపయోగించితి నన్నమాట.

రాజు :- ఈమె కీదశ యెట్లు పట్టినది?

మాళ :- (తనలో) విధివశమున,

జ్యోత్స్న :- ప్రభూ! అవధరింపుడు. మాధవసేనుఁడు శత్రు వశమైనపిమ్మట సుమతి యీమెను దాచి రక్షించెను.

రాజు :- ఔను. ఇది మాకుఁ దెలియును.

ఇరు :- మాకు నింతవరకే తెలియును.

పరి :- ఆపైని నేను జెప్పుదును.

ఇరు :- అమ్మా! ఎవరీమె కౌశికియా? మాట యట్లేయున్నది.

మాళ :- ఆమెకాక మరెవరు.

ఇరు :- ఈ యతివేషములో నీమెను గుర్తింపలేకపోయినాము.

(పరివ్రాజిక వంకకుఁ దిరిగి) అమ్మా! నమస్కారము,

పరి :- మేలగుగాక.

రాజు :- (పరివ్రాజికతో) వీరిఁడఱు మీకు స్వజనమా?

పరి :- ఔను.

విదూ :- (పరివ్రాజికతో) మిగిలినకథ మీరు చెప్పుడు.

కౌశి :- (విన్నఁదనముతో) మాధవసేనుని మంత్రి సుమతి మా యన్నగారు.

రాజు :- పోలికలు లేకపోలేదు. పిమ్మట ?

పరి :- మాధవసేనుఁడు బంధింపఁబడిన వెనుక నాతడు మమ్మిరు వురనుఁ దీసికొని మీ సన్నిధికి బయలుదేరెను.

రాజు :- ఆ తరువాత ?

పరి :- కొంతదూరము పోయి యొక యడవిలో విడిసితిమి.

రాజు :- అప్పుడు !

పరి :- ఏమున్నది !

తూణీ పట్ట నిబంధ బంధుర బృహద్దోరంతరుల్ పార్ష్ణియు
గ్మానద్ధోజ్వల బర్హమండిత తనుల్ వ్యాఘుష్ట మౌర్వీ ధను
ష్పాణుల్ కోయవి యార్చి తాఁకిరి హఠాత్సంపాతమై కోయ ల
క్కోఁనన్ సార్థము బెగ్గడిల్లిమది నొక్కొండొక్క దిక్కైఁచనన్.

(మాళవిక కళవళపడును)

విదూ :- ఇది యిప్పటిమాట కాదులే.

రాజు :- తరువాత ?

పరి :- సాయుధమై వారి నెదిర్చిన వణిగ్జనము కొంతవడికి పలాయితమయ్యెను.

రాజు :- ఇఁకపై వినఁజాలము.

పరి :- అపుడు మా యన్నగారు

ఈయమ సంరక్షింపగ
నా యాపదలోన, రిపుభయాకుల, భర్తృ
ప్రేయోవిధి, ఋణముక్తి కి
నై, యసువుల విడిచి సుమతి యరిగెను దివికిన్. 85

మద :- అయ్యో సుమతి గతించెనా !

జ్యోత్స్న :- కనుకనే భర్తృదారిక కీ యవస్థ.

(పరివ్రాజిక కన్నీరు పెట్టుకొనును)

రాజు :- అమ్మా ! ఇది దేహధర్మము. ఆతనికై విచారింప నక్కఱలేదు. పిమ్మట ?

పరి :- నాకుఁ దెలివి వచ్చునంతలో నీమె మరి కనుపడలేదు.

రాజు :- ఎట్టి కడగండ్లు !

పరి :- పిమ్మట నాతని కౌర్ధ్వదైహికము లొనరించి యీ దేశమునకు వచ్చి యీ యాశ్రమమును స్వీకరించితిని.

రాజు :- బాగున్నది; సజ్జనుల పద్ధతి యిదియే.

పరి :- పిమ్మట నీమె నాటవికులనుండి వీరసేనుఁడు, వీరసేనుని నుండి ధారిణియునుఁ బరిగ్రహించిరి. తరువాత నగరులో నే నీమెనుఁ జూచితిని. ఇంతటితో కథ ముగిసినది.

మాళ :- (తనలో) ప్రభువేమనునో !

రాజు :- పరాభవము లాపదల వెన్నంటియుండును.

దేవేరి యనఁగఁ గడు సం
భావింపన్ దగినదానిఁ బరిజనసామా
న్యావమతిఁ గాంచు టరయగఁ
గ్రావారము స్నానవిధికిఁ బచరించుటగున్. 86

ధార :- (పరివ్రాజికతో) ఆమె కులీనత నెఱిఁగియు నీవు మిన్న కుండినది బాగుగాలేదు.

పరి :- దానికిఁ గారణము లేకపోలేదు:

ధార :- ఏమిటది ?

పరి :- ఈమె తండ్రి బ్రతికియున్న దినములలో నొకసిద్ధుఁ డిట్లు చెప్పెను. "ఈమె యేకవర్ష పరిమితమగు దాస్యము ననుభవించి పిమ్మట ననురూపభర్తృగామిని కాఁగల" దని. అది నీ సపర్యారూపమునఁ బర్యవసించుటఁ జూచి కాలమును బ్రతీక్షించుట మంచిదని తలంచితిని.

రాజు :- ప్రతీక్ష బాగున్నది.

కంచు :- ప్రభూ ! నడుమ నీ కథ వచ్చినది. విదర్భ విషయమునఁ జేయదగిన దంతయును ముగిసినదనియును, ప్రభువుల యభిప్రాయమును వినవలయుననియు, నమాత్యులు విన్నవించుచున్నారు.

రాజు :- మౌద్గల్యుఁడా ! ఆ యజ్ఞసేన మాధవసేనులకు రాజ్యమును భాగింపఁ దలచితిని.

వరదాకూలమ్మున, ను
త్తర దక్షిణములను నేలెదరుగాకవ్ వా
రిరువు రహర్దివముల భా
స్కర హిమకరు లేర్పరించి శాసించు గతిన్. 87

కంచు :- ఇట్లని యమాత్యులకు విన్నవింతును.

రాజు :- (వ్రేలితో ననుమతించును)

(కంచుకి నిష్క్రమించును)

మద :- (జనాంతికముగా మాళవికతో) భర్తృదారకుఁ డర్ధరాజ్యమునఁ బ్రతిష్ఠింపఁబడుచున్నాఁడు.

మాళ :- బ్రతికి బయటపడినాఁడు. అదియే పదివేలు.

కంచు :- (ప్రవేశించి) దేవరబుద్ధి కల్యాణానుసారిణి. మంత్రుల యభిమతము నట్లే.

సమ ధురంధరముల్ రథాశ్వములు రెండు
సారథి నిదేశమునఁ బడి సాఁగునట్లు
నీదు నాజ్ఞాక్రమమ్మున నిలిచియుంద్రు
వార లన్యోన్యధృతి నిర్వికారవృత్తి. ౬౪

రాజు :- వీరసేనున కిట్లు వ్రాయవలసినదని మంత్రులకు నివేదింపుము.

కంచు :- చిత్తము. (నిష్క్రమించి కానుకతోడి యుత్తరమును తెచ్చును) దేవర యానతి నిర్వర్తింపఁబడినది. సేనాపతి పుష్పమిత్రునినుండి సోపాయనముగా నీ లేఖ వచ్చినది, అవధరింపుడు.

(రాజు లేచి పరిగ్రహించి యుత్తరమును పరిజనమున కిచ్చును—
పరిజన ముత్తరమును విప్పును)

ధార :- (తనలో) ప్రాణమంతయును దానిమీఁదనే యున్నది. పెద్దల యోగక్షేమములతోఁబాటు వసుమిత్రుని వార్త కూడ వచ్చియుండును. సేనాపతి యతనిని బెట్టిదమగు పనిలో నియోగించినాఁడు.

రాజు :- (కూర్చుండి యుత్తరమునుఁ జదువును)

"యజ్ఞాయతనమునుండి సేనాపతి పుష్పమిత్రుఁడు కుమారుఁ డగ్నిమిత్రుని సప్రేమముగాఁ గౌఁగిలించికొని వ్రాయునది.

"మనుమఁడు వసుమిత్రుఁడు గోప్తగా విడువఁబడిన యజ్ఞాశ్వమును దక్షిణసింధుతీరమున యవనరాజులు బంధించిరి. ఉభయ సైన్యములకు మహాయుద్ధము జరిగినది.

(ధారణి విచారాక్రాంతయగును)

రాజు :- ఎట్టి సంఘటన ! (మరలఁ జదువును)

అశ్వరాజు శత్రు హస్తంగతమ్మైన
వింటికోన రిపుల విద్రిచి తెచ్చె
మేటి జోదులకును మీ నందనుఁడు వసు
మిత్రుఁ డాజిలో నమిత్రజేత. 89

ధార :- ఇప్పటికి ప్రాణము కుదుటఁ బడినది.

రాజు :- "సురక్షితముగాఁ గొనితేఁబడిన యశ్వముతో, నేను సగరునివలె, యజ్ఞమును నిర్వర్తింపఁబోవుచున్నాను. నీవు యజ్ఞవేళకు వధూజనము నందఱనుఁ దీసికొనిరమ్ము."

పరి :- ఇట్టి పుత్ర విజయవార్త వినఁగలుగుట రాజదంపతులదృష్టవంతులు.

భర్తవలన వీరపత్నుల కెల్లను
మొదలిదానవైతి ముదిత మున్ను
తనయువలన నేఁడు దాల్చితి వీరప్ర
సూ ప్రశంస నెంత సుకృతవతివొ ! 90

ధార :- ఉచిత ప్రసవమున నే నదృష్టవంతురాలను.

రాజు :- మౌద్గల్యుఁడా ! కలభము యూధపతినే యనుసరించి నదిగదా !

కంచు :- దేవా !

విజయ మింతయయ్యు విస్మయకారి గా
దరయ మీ తనూజునందు రాజ !
ఊరుజన్మ నెడ సముద్గమించిన వహ్ని
యబ్ధి బలములెల్ల నార్పుటరుదె ? 91

రాజు :- మౌద్గల్యుఁడా ! మౌర్యసచివుఁడు మున్నగు బంధితుల నెల్ల విడువవలసినదని చెప్పుము.

కంచు :- చిత్తము. (నిష్క్రమించును)

ధార :- జయసేనా ! రాచనగరులో నీ వార్త చెప్పుము.

ప్రతి :- (బయలుదేరును)

ధార :- ఒకమాట.

ప్రతీ :- (మరలి) ఇదిగో.

ధార :- (జనాంతికముగా) అశోకదోహద విషయమున మాళవికకు నే నొసఁగిన వాగ్దానమును. ఆమె కులీనను, ఇరావతికి నచ్చఁజెప్పి మాట దక్కింపుమంటి నను ము.

ప్రతీ :- చిత్తము. (నిష్క్రమించి తిరిగివచ్చి) పుత్ర విజయ వార్తనుఁ దెలిపినందులకు రాణుల నగలన్నియు నాపై వర్షించినవి.

ధార :- ఆశ్చర్యమేమున్నది ? ఇది నాకొకటియు, వారి కొకటియునా ?

ప్రతీ :- మరియు నిరావతి యిట్లు విన్నవించినది. "దేవి కొకరితో నిమిత్తమేమి ? ఆమె సంకల్ప మనుల్లంఘ్యము".

ధార :- (పరివ్రాజికతో) అమ్మా ! సుమతి సంకల్పించిన యీ వివాహమునకు, నీ యనుమతినిఁ బ్రతీక్షించుచున్నాను.

పరి :- అంతయును నీదే.

ధార :- (మాళవిక చేయి పుచ్చుకొని రాజువద్దకు వచ్చి) పుత్ర విజయవేళ నీమెను నా కానుకగాఁ బరిగ్రహింపుఁడు.

(రాజు సిగ్గుపడును)

ధార :- (నవ్వుచు) ఆర్యపుత్రులు సంశయించుచున్నారా ?

విదూ :- ఎంతయైననుఁ గ్రొత్త పెండ్లికొడుకు గదా :

(రాజు విదూషకునివంకఁ జూచును)

విదూ :- పట్టమహిషీప్రసాదమువలన దేవీశబ్దభాజన మగు నీమెను ప్రభువులు పరిగ్రహింప నెంచుచున్నారు.

ధార :- అది యీమెకుఁ బుట్టుకతోనే వచ్చినది.

పరి :- అది సరికాదు. ఇటు చూడుము.

ఆకరప్రరూఢమైనను, లక్షణో
జ్జ్వలమునైన, రత్నజాతియైన
జాతరూప సంగ సౌభాగ్య మలవడ
వలయుఁగాదె మణికి నళినయన ! 92

ధార :- (పరివ్రాజికతో) అమ్మా క్షమింపుము. ఈ సందడిలో మరచితిని. జయసేనా ! సితదుకూలయుగళమును దెమ్ము.

ప్రతీ :- చిత్తము. (పోయి మరలివచ్చి) ఇవిగో. (దుకూలము లిచ్చును)

ధార :- (మాళవికకు మేలిముసుఁగు నలవరించి) ఆర్యపుత్రు లీమెను బరిగ్రహింపుఁడు.

రాజు :- నీ యాజ్ఞ. (చేయిపుచ్చుకొని జనాంతికముగా) ఆహా ! ఇప్పటికిఁగృతార్థుఁడ నైతిని.

విదూ :- ఆహా ! ఈమె యానుకూల్యమెట్టిది !

ప్రతీ :- (ప్రవేశించి మాళవిక నుద్దేశించి) భట్టినికి జయము.

(ధారణి పరివ్రాజికవంకఁ జూచును)

పరి :- వింత యేమియును లేదు.

ప్రతిపక్షమ్మున నైనను
బతిహిత మొనరింత్రు భర్తృవత్సల, లంభః
పతికిం జేర్చు మహానదు
లితర నదీవారి సంగ్రహించియె తమతోన్. 83

నిపు :- (ప్రవేశించి) దేవా ! ఇరావతి విన్నవించుచున్నది. "అజ్ఞానకృతమగు నా యపరాధముగూడ ప్రభువుల కనుకూలముగనే పరిణమించినది. ఇప్పుడు నేను మీ దాక్షిణ్య లేశమును మాత్ర మభ్యర్థించుచున్నాను."

ధార :- ఈ యభ్యర్థనమును ప్రభువు లంగీకరించిరి.

నిపు : అనుగ్రహింపఁబడితిని.

పరి :- మీ సంబంధమునఁ గృతార్థుఁడగు మాధవసేనునిఁ జూచి వత్తుము.

రాజు :- మాధవసేనముఖముననే యిఁకనుండి మీయోగక్షేమము
లనుఁ దెలియఁగలము.

పరి :- మీ మైత్రికి ఋణపడితిని.

ధార :- ఆర్యపుత్రా ! మీకిఁక గావలసినదేమి ?

రాజు :- నీ ప్రసాద సౌముఖ్యమ్మె నిరత మేను
గోరునది యింతకునుమించి కోర్కెలేదు
ఐన నిట్లగుగాక. (భరతవాక్యము)
అగ్ని మిత్రుండు గోప్త ! భీత్యపగమాదు
లైన శ్రేయమ్ము లొదవుట యరుదె ! ప్రజకు. 94
ఇష్యుద్భవా ధూమలతా ప్రతానా
నభస్తమాలే విచరంతు సర్వశః
త దుద్గమ శ్యామ మనోహరద్యుతిః
వలాహకః పాతు వసుంధరా మిమాం. 95
అపి యజన పరాశ్చ బ్రాహ్మణా బ్రహ్మనిష్ఠా
శ్రుతి రిహ ముఖరా చ ప్రస్రవిణ్యశ్చ గావః
క్షితిరపి బహు సస్యశ్యామ సీమాంత లేఖా
హుతసురభి రయం నో జాతవేదా భవంతు. 96

(అందఱు నిష్క్రమింతురు).

ఓం తత్సత్.

సమీక్ష

'మాళవికాగ్నిమిత్రము' కాళిదాసకృత నాటకములలో ప్రాయశః మొదటిది. శాకుంతలమున సంఫుల్లమల్లికాస్తబకమువలె సహృదయుల నలరింపఁజేసిన మహాకవి ప్రతిభాకౌశలములిందు అరవిరిసి తొలిజాబిలిరేక వలె అపూర్వానందమును గల్పించుచున్నవి.

మాళవిక పరిమాణమునఁ జిన్నది. అయిదంకముల నాటకము. వస్తువును చిన్నదే. కథయంతయు రాజాంతఃపురమున కొన్నిదినముల పరిమితిలో నడచినది. సామాన్యజీవితమునందువలె కష్టసుఖములు, ఎత్తు పల్లములు లేక సమతలముపై సాగు శృంగారప్రవాహమిది.

వస్తువు :- మహాకవి శృంగారప్రధానమైన వస్తువునే మూడు నాటకములలో గ్రహించెను. హాస్యవీరములంగములు. ప్రసిద్ధవంశుఁడైన అగ్నిమిత్రుడిందు నాయకుఁడు. రాజస్యాలకుఁడైన వీరసేనునిచే నుపాయన ముగా పంపబడిన మాళవిక నాయిక. చిత్రరువులో ఆమె ప్రతికృతిని గాంచి నిజరూపముఁ జూడ నాకాంక్షించిన రాజునకు విదూషకుని ఉపాయముచే మాళవికా రూపసౌందర్యదర్శనమే కాక నాట్యసందర్శనోత్సవమును కల్గును. ధారణీ పరిరక్షితయైన ఆమె సులభదర్శనకాదు. శృంగార సచివుడగు నర్మసఖుని యుక్తిచే సమాగమము కల్గినను ఇరావతీ ప్రవేశముచే అంత రాయము ఘటిల్లును. రక్తాశోకదోహదఫలమునను, కుమారవిజయోదంత శ్రవణానందమునను తృప్తిచెందిన దేవి మాళవికను రాజునకు కానుకగా అర్పించును. శిల్పకారికలవలన మాళవికయొక్క కులీనత వెల్లడియై యెల్లర కానందకరముగ నాటకము పరిసమాప్తమగును.

ఇది ప్రధానేతివృత్తము. అశోకదోహదవృత్తాంతము, ఇరావతి ప్రణిపాతతిరస్కృతి మున్నగునవి ప్రాసంగికములై ప్రధానకథాప్రవాహ మున కుత్కర్షగలిగించుచున్నవి.

రచనా సంవిధానము :- నాటకరచనాసంప్రదాయ నిర్మాణ కర్తయగు మహాకవి నాటకములలో లక్షణము నన్వేషించుట. సమన్వయింపఁ బ్రయత్నించుట. హాస్యాస్పదము. కాని ప్రతిగ్రంథమును లాక్షణిక సిద్ధాంతానుసారముగ పరిశీలించుటయు ప్రాచీనుల పద్ధతి.

పూర్వరంగము :- రంగవిఘ్నోపశాంతికై లోకశ్రేయమునకై మంగళాచరణపూర్వకముగ సభాసమక్షమున రంగముమీఁద పఠింపఁబడు దేవతాస్తుతి నాంది. ఈ నాందీలక్షణమును గురించి యాలంకారికులలో ఏకాభిప్రాయము కనిపింపదు. ద్వాదశపదపరిమితమై చంద్రారవింద శంఖాది మంగళకర వస్తువుల ప్రశంస యుండవలెనని యొకరును అష్టాదశపద పరిమితము కావలెనని మఱియొకరును వ్రాసియున్నారు. కాళిదాసు తన మూఁడు నాటకములలో మూఁడు విధములుగ బరమేశ్వరతత్త్వమును దర్శించి యుత్ఫుల్లహృదయముతోఁ బ్రస్తుతించియున్నాఁడు. మాళవికాగ్నిమిత్రమందు —

" ప్రణతనానాఫలప్రదమీశ్వరత్వమ్ము । నెనసియు నెవఁడు చర్మైకధరుఁడు
కాంతావిభాగ సంకలిత దేహుండయ్యు । ధృతి నిర్విషయమనోధ్యేయుఁడెవఁడు
తనువులెన్మిది జగత్సంభారవహులయ్యు । నభిమాన లేశమ్ము నంట దెవని
సన్మార్గ దర్శన శ్వశ్రేయసము పొందె । నతఁడు తొలంగబెట్టుతఁ బ్రగాఢ
మగుచు సకలాంతరంగమ్ము లలమియున్న । విరతమోవృత్తి నభవుండు తరుణచంద్ర
మఃకళాకాంతి కాయమాన వలిత । పాటల జటాలతా పల్లవముల వేల్పు "

ఈ నాటక ప్రారంభమున కవికి కలిగిన దర్శనమిది । పరస్పరవిరుద్ధము వోలె ఆభాసగా తోచునట్టిది. ప్రణతనానాఫలప్రదమగు ఈశ్వరత్వము నెనసియును చర్మైకధరుఁడు. కాంతావిభాగసంకలితదేహుండయ్యును నిర్విషయ మనస్కులగు యతీంద్రులకు అవలివాఁడు. అష్టమూర్తియయ్యును అభిమానరహితుఁడు. అట్టి పాటల జటాలతాపల్లవముల వేల్పు సన్మార్గాలోకనమునకై విరతమోవృత్తి నపనయించుగాక. ఈ ప్రతిసీర వివృత్త

మైనంతనే జ్యోతిర్దర్శనమగును. అప్పుడే పరస్పరవిరుద్ధములవలె తోచు ఈ ప్రకృతులకు సమన్వయము కుదురఁగలదు.

నాందీశ్లోకమున కావ్యార్థము సూచింపఁ బడవలెనని దశరూపకమున నున్నది. కాని దానికై ప్రయత్నించుట మహాకవి యెన్నడును చేయఁడు. అతని రచనయందొదిగి యుండునదే లక్షణము. అది పృథగ్యత్న నిర్వర్త నీయముగాదు. నాంద్యనంతరము కావ్యార్థము ప్రస్తుతింపఁబడుటయే ప్రస్తావన. దీనినే ఆముఖమనియు నందురు. సూత్రధారుఁడు నటీమారిషులలో నెవరితోనైనను చమత్కారజనకముగా కవినిగురించి, సదస్సునుగురించి ప్రసంగించును. ఈ ప్రసంగమున కొంతవరకు తన కావ్యమును తానే పరి శీలించుటయో, ప్రశంసించుటయోకూడ కన్పించును. మాళవికాగ్ని మిత్రమున ఈ ప్రస్తావన సంక్షిప్తము. ప్రాచీనమెల్ల సమీచీనము కాదనియు, అర్వాచీనత కావ్యమునకు అవద్యాపాదకము కాదనియు, ధీచతురులు పరిశీలించి గ్రహింతురనియును పరప్రత్యయనేయబుద్ధులు మూఢులనియు నుద్ఘాటించుచు సూత్రధారుఁడు పాత్రప్రవేశమును సూచించి నిష్క్ర మించును. ఉద్ఘాత్యకము, అవలగితము, ప్రయోగాతిశయము, ప్రవర్తకము, కథోద్ఘాతము, అనునీయైదు విధానములలో నిర్దిష్టముగ పాత్రప్రవేశము సూచింపఁబడినది గనుక నిందుప్రయోగాతిశయము. సామాన్యముగ నాటక ములలోఁ గనిపించు ఋతువర్ణన మిందులేదు.

కథోన్మీలనము:- నాటకము పద్మమువలె క్రమముగా సహజముగా రేకులు విప్పికొన్నట్లు వికసించుటకై ఏర్పరచిన విభాగములే అర్థప్రకృతులు. కార్యావస్థలు. బీజము, బిందువు, పతాక, ప్రకరి, కార్యము, అను నీయైదు అర్థప్రకృతులును, ఆరంభ, యత్న, ప్రాప్త్యాశా, నియతాప్తి ఫలాగమము లనెడు కార్యావస్థలతో క్రమముగా సంపదించి పంచసంధులుగా నేర్పడుచున్నవి. ఈ విభాగము లన్నియు కథానిర్వహణమునందు ఎట్టి

శైథిల్యము, లోపము కలుగనీక బిగువు కూర్పు, కలుగుటకే యుద్దేశింప బడినవి, కథాసంధాన మొకచో నిబిడముగా ఒకచో శిథిలముగా, నున్నచో రూపకశరీర సౌష్ఠవమే చెడిపోవును. ఈ నిర్మాణసౌష్ఠవమును నిలుపుటకే యీ నిబంధనలు - కాని ఏ ప్రసిద్ధనాటక మందైనను కవి యీసంధులను యథాతథముగ ననుసరించి వ్రాయవలెనని ప్రయత్నించినట్లు మనకు తోచదు. ఇవి యన్నియు మనము ఊహించుకొనవలసినవేకాని నిర్దిష్టముగ కనిపించు నట్టివికావు. మాళవికాగ్నిమిత్రములో ఇవియెట్లు సమన్వయింపఁబడినవో పరిశీలింతము.

ముఖ్యఫలసిద్ధికై చూపు ఉత్సుకతయే ఆరంభము. ఇది ఫలహేతువైన బీజముతోకలసి ముఖసంధి యగుచున్నది. ప్రథమాంకమున చిత్రదర్శన మను బీజమువలన అంకురించి మాళవికాసందర్శనము కొఱకు రాజు చేయు యత్నమంతయు ముఖసంధియే ;- ధారణీదేవి ప్రాతికూల్యము వలన అంతరాయములు కలుగుచు తొలఁగుచు నీటిమీఁద తైలబిందువువలె కథ విస్తరించుచు రాజుచేయు ప్రయత్నముతోఁగలసి ప్రతిముఖసంధి యేర్పడు చున్నది. ఫలమును గర్భీకరించుకొని నిరంతర సందేహాన్వేషణములతో సాగునది గర్భసంధి :- ఇందు అశోకదోహద వృత్తాంతము పతాకయై నాయకునకు ఫలావాప్తి యందాశ కలిగించుచుండగా ఇరావతీ ప్రవేశముతో ఆటంకమేర్పడినది. నిగాళ క్రమముగా తొలఁగుచునే అతర్కితములైన అంత రాయములతో కథ క్రొత్తదారిత్రొక్కుచు ఫలప్రాప్తి నిశ్చితమగుఁటయే నియతాప్తియనునవస్థ. దీని కనురూపముగ వసులక్ష్మి కోతినిఁజూచి భయ పడుట, అశోకముపుష్పించిన వృత్తాంతము, ప్రకరీవృత్తములై నాయకునకు ఫలానుభవమునకుఁ దోడ్పడుట యవమర్శసంధి, తుదకు సర్వవిఘ్నములు తొలఁగి ఫలాగమమను కార్యావస్థయందు మాళవిక కులీనత తేటపడి,రాజు కల్యాణము సూచితమై ఫలప్రాప్తికలుగుటయే నిర్వహణసంధి.

ముఖ్యపాత్రలు :- దుష్యంతుని యుదాత్తతగాని పురూరవసుని భావావేశముగాని, అగ్నిమిత్రునియందుఁ గానరావు. రాజకీయ వ్యవహారముల యందు దక్షుఁడుగ శౌర్యశాలిగఁ జిత్రించుటకుఁ గొంతప్రయత్నము జరిగినను సామాజికుల కీతఁడు ప్రధానముగ ప్రణయలాలసుఁడగు ధీరలలితుఁడుగనే గోచరించును. ఇందు అంకురప్రాయములై కన్పించిన లక్షణములు తరువాతి నాటకములలోని నాయకులలో సంపూర్ణోన్మీలితములైనవి. మాళవికయు నట్టులే ముగ్ధ. కాని - శకుంతల తన తేజఃపరివేషముచే పరిసరములను వెలిఁగింపఁజేసినట్లు ఈమె వెలిఁగింపలేదు. ఊర్వశి తారుణ్యోజ్జ్వల సౌందర్యము నిందుఁ గనిపింపదు. కాని తొలకరి మల్లెమొగ్గవంటి ఈమె మౌగ్ధ్యము ఒకానొక మాధుర్యమును, స్వచ్ఛతను వెలార్చుచున్నది. ఈమె వృత్తాంతమే రహస్యము. అట్లే తన సుకుమారముగ్ధప్రణయమును దీపపు వెలుఁగునువలె చేతులొడ్డి దాచికొన ప్రయత్నించినట్లనిపించును. ఈ సహజమైన వెఱపు, లజ్జాసాధ్వసములే ఈ పాత్రకు వెన్నెలవంటి ఒక యందము తెచ్చిపెట్టినవి. ఈమె సహచరి నెచ్చెలి నలఁగినకొలఁది పరిమళించు వకుళావళిక ! ఈమెలోని స్నేహమాధుర్యము, సంభాషణచాతుర్యము ద్విగుణీకరింపఁబడి తరువాత అనసూయాప్రియంవదలుగ రూపుదిద్దుకొనిన ననిపించును.

ఈ నాటకమునకంతకును ఔదాత్త్యగాంభీర్యముల నాచికొన్నది ధారణీదేవి. తక్కిన రెండు నాటకములలో నామమాత్రస్థితయైన పట్టపురాణి తన సంపూర్ణమగు దీప్తితో నిందు ప్రత్యక్షమైనది. తన స్థానమునకు, వయస్సునకు తగిన నిండుదనము, గాంభీర్యము, ప్రసన్నత, సమయానుకూలమైన పట్టు విడుపులు - ఇవి అన్నియు ఒక ఉదాత్తతను వెలార్చుచున్నవి. ఈ నాటకమునందలి విదూషకుఁడు మిగిలిన నాటకములందుకంటె చైతన్యము ప్రాణము కలిగినవాఁడు. కేవల భోజననిద్రాప్రియుడుగనే మిగులక రాజునకు శృంగారసచివుఁడై కథాగమనమునందు ప్రముఖపాత్ర నిర్వహించినాఁడు, ఇతని సంభాషణలు చమత్కారములు సజీవములు.

పరివ్రాజిక మాళవిక కులీనతను గుర్తించియు సిద్ధాదేశమును విని యున్నది గనుక కాలమును ప్రతీక్షించినది. నిరాసక్తయయ్యును మాళవి కాగ్నిమిత్రుల వివాహమును వాంఛించినది.

సన్నివేశకల్పనము :- మాళవికాగ్నిమిత్రములోని అందమంతయు నందలి సన్నివేశములందేయున్నది. ఒకదానికొకటి హేతువులై కృతకముగా కనిపింపక తమతమ ప్రయోజనములను నిర్వర్తించి నిశ్శబ్దముగ నిష్క్రమించును. ప్రథమాంక ప్రారంభమునందలి నాగముద్రాంకితాంగుళీయకము చతుర్థాంకమున తన ప్రయోజనము సంపూర్ణముగ నెరవేర్చికొన్నది. మాళవిక విద్యాగ్రహణకౌశలము హరదత్తగణదాసుల వివాదములో చారితార్థ్యము గడించుకొన్నది. అంతవఱకు పుష్పింపక మౌనము వహించిన రక్తాశోకము చతుర్థాంకాంతమున ఇరావతి ఆగ్రహమునకు గురికానున్న మాళవికను రక్షించుటకై నిలువున మొగ్గదొడగి ఋణముతీర్చికొన్నది. ఇటుల - ఏసన్నివేశము చూచినను సహజరమణీయముగ మొలిచినట్లు స్వయంప్రభా విలసితమగుచు కథా గమనమునకుఁ దోడ్పడుచున్నది.

చూచినకొలఁది. తలఁచినకొలఁది. తరచినకొలఁది. తిన అవిస్పష్ట రేఖలను ఒక్కటొక్కటిగా వెలువరించునది మహాకవి ప్రతిభ। మిగిలిన దంతయు సహృదయుల మనస్సులలో దాఁగియున్నది.

అవంతీ ప్రెస్
రాజమహేంద్రవరము

AGCA 10 | B | 115
BCA

అవంతీ ప్రెస్
రాజమహేంద్రవరము

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AGCA101B117
పుస్తకం పేరు	వల్లభరయదేవ స్తోత్రమ్
తారీఖు	14 August 2024
ముందు అట్ట	NO yes
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	93
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	[illegible]
లేని పేజీలు	NO
తయారు చేసినవారు	Rohith
పేజీలు విడదీసినవారు	[illegible]
స్కాన్ చేసినవారు	Vyshnavi
పరీక్ష చేసినవారు	THASIN
పేజీలు పరిచూసినవారు	
బైండింగు చేసినవారు	
ప్యాకింగు చేసినవారు	
పరిస్థితి	good